# నేటి సాక్షి

తెలుగు దిన పత్రిక | TGTEL/25/A1737 | వాస్తవాలే వార్తలుగా..

08.03.2026
ఆదివారం Sunday

సంపుటి (volume): 1
సంచిక (Issue): 228

పేజీలు : 10
Pages : 10

వెల రూ. 2.00

Published from : Hyderabad
Circulated to : Telangana



## రిపోర్టర్లు కావలెను

జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి నేటి సాక్షి ఆహ్వానం పలుకుతుంది.

తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లకు కాల్ చేసి సంప్రదించగలరు.

9119949944
7897222788 - 7897222789


# ట్రంప్ తదితరుల హత్యకు ప్లాన్

- ఇరాన్ ప్రోద్బలంతో రంగంలోకి ఆసిఫ్ మర్చంట్
- పాకిస్థానీని దోషిగా తేల్చిన స్థానిక కోర్టు






# మహిళల రక్షణ సమాజం బాధ్యత

మహిళా వేధింపులను నిలదీసే సమాజం రావాలి

## వారి కోసం ఎన్నో చట్టాలు తెచ్చాం



### ఆర్థిక స్వావలంబన కోసం అనేక పథకాలు అమలు

### స్టాండ్ విత్ హర్ కార్యక్రమంలో సీఎం రేవంత్

**హైదరాబాద్, మార్చి 7:** మహిళల రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. జేఎన్‌టీయూ ఆడిటోరియంలో 'స్టాండ్ విత్ హర్' కార్యక్రమంలో సీఎం రేవంత్ పాల్గొన్నారు. మహిళల రక్షణ కోసం అనేక చట్టాలు తీసుకొస్తున్నాం. వారు ఆర్థికంగా బలపడాలనే ఆలోచనతోనే మహిళాశక్తి పథకం తీసుకొచ్చాం. మహిళలపై ప్రభుత్వానికి సంపూర్ణ విశ్వాసం ఉంది. వారి ప్రాధాన్యం గుర్తించి పార్టీలో పదవులు ఇస్తున్నాం. ఆర్టీసీలో వెయ్యి బస్సులకు మహిళలే యజమానులు. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు అంతర్జాతీయ గుర్తింపు లభిస్తోంది. సోషల్ మీడియాలో మహిళలను వేధించే ఘటనలు తాజాగా పెరుగుతున్నాయి. వాటిని కట్టడి చేయాల్సి ఉందని అన్నారు.

.. వివరాలు 2లో

## లొంగిన మావోయిస్టులకు ఆర్థిక, ఆరోగ్య భద్రత

### 130 మంది మావోయిస్టులు లొంగుబాటు

### గణపతి కూడా లొంగిపోవాలన్న సీఎం

శాంతియుత వాతావరణంలోనే సమస్యకు పరిష్కారం దొరుకుతుందని రేవంత్ రెడ్డి అన్నారు. లొంగిపోయిన మావోయిస్టుల ఆర్థిక, ఆరోగ్య భద్రతకు భరోసా కల్పిస్తాం. ఇంకా అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులు లొంగిపోవాలి. లొంగిపోయిన మావోయిస్టులకు అవసరమైన వసతులు కల్పిస్తాం అని అన్నారు.

# రైతుబంధు ఇంకా ఎప్పుడిస్తారు

### మూడు పంటలకని చెప్పి ఒక్కటి కూడా ఇవ్వరా

### కరీంనగర్ జిల్లాలో పర్యటించిన హరీష్ రావు

తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుబంధు ఇచ్చే తెలివి లేదా అని ప్రశ్నించారు. మూడు పంటలకు రైతుబంధు ఇవ్వాలని గతంలో ఆయన చెప్పారని.. కానీ ఇప్పుడు తన హయాంలో మూడు పంటలకు రైతుబంధు ఎగొట్టారని ధ్వజమెత్తారు.





## బీర్‌బాటిల్‌లో చేపపిల్ల

.. వివరాలు 2లో

## వ్యభిచార ముఠా ఆటకట్టు

.. వివరాలు 2లో



# హైదరాబాద్ కేంద్రంగా

## ప్రపంచస్థాయి ఏఐ ఆర్థిక ఆవిష్కరణలు

### మంత్రి శ్రీధర్ బాబు

కృత్రిమ మేధ ఆధారిత ఆర్థిక సాంకేతిక రంగంలో హైదరాబాద్ గ్లోబల్ హబ్‌గా ఎదుగుతోందని మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. శనివారం బాచుపల్లిలోని విజ్ఞాన జ్యోతి ఇన్ స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ లో ఫిక్కి నిర్వహించిన సిఎఫ్ఓల సదస్సులో ఆయన కీలకోపన్యాసం చేసారు. ప్రపంచంలోని ప్రముఖ ఆర్థిక సంస్థలు నగరంలో తమ ఆవిష్కరణలు, ఇంజినీరింగ్ కేంద్రాలను స్థాపిస్తున్నాయని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.



# వ్యవసాయ యాంత్రీకరణకు సబ్సిడీ నిధులు


నేరుగా రైతుల ఖాతాలోకి బదిలీ

ఖరీఫ్ సీజన్ కోసం ముందుగానే ఎరువులు

3

మంత్రి తుమ్మల





# 99రోజుల్లో లక్ష్యాలను చేరుకోవాలి

### హౌసింగ్ బోర్డులోని 5వేల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తిచేయాలి

### పోర్టల్‌ను ప్రారంభించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ప్రజాపాలన- ప్రగతి నివేదిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా హౌసింగ్ బోర్డు పరిధిలో పెండింగ్‌లో ఉన్న ఐదు వేల రిజిస్ట్రేషన్‌లను క్లియర్ చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు.

నేటి సాక్షి TGTEL/25/A1737 | NETI SAKSHI
కరీంనగర్ | ఆదివారం 08 మార్చి 2026



# హైదరాబాద్ కేంద్రంగా

## ప్రపంచస్థాయి ఏఐ ఆర్థిక ఆవిష్కరణలు

### మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి

**హైదరాబాద్, మార్చి 7:** కృత్రిమ మేధ ఆధారిత ఆర్థిక సాంకేతిక రంగంలో హైదరాబాద్ గ్లోబల్ హబ్‌గా ఎదుగుతోందని ఐటి, పరిశ్రమలు, వాణిజ్య శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. శనివారం బాచుపల్లిలోని విజ్ఞానజ్యోతి ఇన్ స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ లో ఫిక్కి నిర్వహించిన సిఎఫ్ఓల సదస్సులో ఆయన కీలకోపన్యాసం చేసారు. ప్రపంచంలోని ప్రముఖ ఆర్థిక సంస్థలు నగరంలో తమ ఆవిష్కరణలు, ఇంజినీరింగ్ కేంద్రాలను స్థాపిస్తున్నాయని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. కృత్రిమ మేధ టెక్నాలజీ పాత్రను పూర్తిగా మార్చేస్తోంది. ఇప్పటివరకు కంపెనీ ఖర్చులను లెక్కించడానికి ఉపయోగపడిన టెక్నాలజీ, ప్రస్తుతం ఆవిష్కరణలు, మెరుగైన ఆర్థిక నిర్ణయాలకు సహాయపడుతోంది. హైదరాబాద్ ప్రపంచంలోనే అత్యంత బలమైన ఫైనాన్షియల్ టెక్నాలజీ ఎకోసిస్టమ్‌లలో ఒకటిగా అభివృద్ధి చెందింది. వ్యాన్ గార్డ్, యుబిఎస్ , వెల్స్ ఫార్గో, బ్యాంక్ ఆఫ్ అమెరికా, మాస్ మ్యూచువల్, ఫ్రాంక్లిన్ టెంపుల్టన్, జెపి మోర్గాన్ చేస్ , గోల్డ్ మ్యాన్ శాక్స్, సిటి గ్రూప్ లాంటి ప్రఖ్యాత ఆర్థిక సంస్థలు నగరంలో భారీ టెక్నాలజీ, అనలిటిక్స్ కేంద్రాలను నిర్వహిస్తున్నాయి. నగరంలో ప్రస్తుతం 400 గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు మూడు లక్షల మందికి పైగా వృత్తి నిపుణులకు ఉపాధి కల్పిస్తున్నాయి. తెలంగాణ ఐటీ రంగం ఎగుమతులు సంవత్సరానికి దాదాపుగా 40 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. తదుపరి దశ విస్తరణ కోసం ఏఐ సిటీ, ఫ్యూచర్ సిటీ, ఏఐకేఏఎం లను ఏర్పాటు చేస్తున్నాం. వీటి ద్వారా ఏఐ ఎకోసిస్టమ్‌ను మరింత బలోపేతం చేయడం, డిజిటల్ మౌలిక వసతులను మెరుగుపర్చడం, ఏఐ ఆధారిత ఆర్థిక వ్యవస్థకు అవసరమైన నిపుణులను తయారు చేయడం లక్ష్యంగా పెట్టుకున్నాం అని మంత్రి అన్నారు. డిజిటల్ యుగంలో సీఎఫ్ఓల పాత్ర మరింత కీలకంగా మారింది కృత్రిమ మేధ, డేటా ఆధారిత రంగాల్లో పెట్టుబడులకు మార్గనిర్దేశర చేయడంలో వారి సేవలు మరింత ప్రాధాన్యతను సంతరించుకున్నాయని శ్రీధర్ బాబు వివరించారు. సదస్సులో మాజీ చీఫ్ విజిలెన్స్ కమిషనర్ కె.వి.చౌదరి, ప్రముఖ నిర్మాత, విజ్ఞానజ్యోతి ఇన్ స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్ మెంట్ అధ్యక్షుడు దగ్గుబాటి సురేశ్ బాబు, ఫిక్కి సిఎఫ్ ఓ కౌన్సిల్ ఛైర్మన్ రజనీష్ జైన్, కో ఛైర్మన్ సుబ్బయ్య కుమార్, విజ్ఞాన జ్యోతి సంస్థల సిఇఓ, మాజీ డిజిపి అనురాధ తదితరులు పాల్గొన్నారు.

# గవర్నర్ జిష్ణుదేవ్‌తో భట్టి భేటీ



**హైదరాబాద్, మార్చి 7:** మహారాష్ట్ర గవర్నర్‌గా బదిలీపై వెళుతున్న జిష్ణు దేవ్ వర్మని లోక్ భవన్‌లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు మర్యాదపూర్వకంగా కలిసారు. పుష్ప గుచ్ఛం, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయనతో పలు అంశాలను పంచుకున్నారు. అలాగే ఇంతకాలం తెలంగాణ గవర్నర్గా ఇక్కడి అభివృద్ధిలో భాగమైనందుకు అభినందించారు. ఇటీవలి మార్పుల్లో జిష్ణుదేవ్ వర్మ మహారాష్ట్ర గవర్నర్‌గా వెళుతున్నారు. తెలంగాణకు శుక్లా రానున్నారు.

# కూకట్‌పల్లిలో వ్యభిచార ముఠా ఆటకట్టు

**హైదరాబాద్, మార్చి 7:** కూకట్‌పల్లిలో వ్యభిచారం నిర్వహిస్తున్న ముఠాను శనివారం సైబరాబాద్ పోలీసులు పట్టుకున్నారు. వ్యభిచార ముఠా నిర్వహిస్తున్న ఇద్దరితో పాటు మరో అయిదు మంది కస్టమర్లను అరెస్టు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ముఠాకు చెందిన మరో ఇద్దరు మహిళలను రెస్క్యూ చేసినట్లు చెప్పారు. ఓ సమాచారం ఆధారంగా సైబరాబాద్‌కు చెందిన ఏహెచ్‌టీయూ బృందం రెయిడ్ నిర్వహించింది. సుమిత్రానగర్‌లో ఉన్న ఇండ్లపై దాడి నిర్వహించారు. రాకెట్ నడుపుతున్న వారితో పాటు కస్టమర్లను అదుపులోకి తీసుకున్నారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల ద్వారా కస్టమర్లను ఆకట్టుకుంటున్నట్లు గుర్తించారు. వారి నుంచి అధిక మొత్తంలో డబ్బులు వసూల్ చేస్తున్నట్లు తేల్చారు. భారీ మొత్తంలో డబ్బు వసూల్ చేసినా.. బాధితులకు మాత్రం తక్కువే ఇస్తున్నట్లు పోలీసులు నిర్ధారించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశారు.

# బీర్‌బాటిల్‌లో చేపపిల్ల



**హైదరాబాద్, మార్చి 7:** బీర్ తాగేందుకు వెళ్లిన ఓ వ్యక్తికి ఊహించని షాక్ తగిలింది. బీర్ బాటిల్‌లో ఓ చేపపిల్ల ఈదుతూ కనిపించింది. హైదరాబాద్ నాచారం పరిధిలోని మల్లాపూర్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. మల్లాపూర్‌లోని జేపీ వైన్ షాపులో ఓ వ్యక్తి శుక్రవారం నాడు కింగ్‌ఫిషర్ లైట్ బీర్ కొనుగోలు చేశాడు. దాన్ని తాగేందుకు మూత ఓపెన్ చేయగానే అందులో చేప పిల్ల కదులుతూ కనిపించింది. దీంతో ఒక్కసారిగా అవాక్కయిన కస్టమర్.. వెంటనే షాపు నిర్వాహకుడిని ప్రశ్నించాడు. అయితే అతనితో వైన్ షాపు నిర్వాహకులు దురుసుగా ప్రవర్తించారు. బీర్లు తాము తయారుచేయమని.. ఏదైనా ఉంటే తయారుచేసిన కంపెనీని అడుక్కోవాలని నిర్లక్ష్యంగా సమాధానమిచ్చాడు. దీంతో బీర్ బాటిల్‌లో చేప కదలడాన్ని వీడియో తీసి సోషల్‌మీడియాలో పోస్టు చేశారు.

# మహిళల రక్షణ సమాజం బాధ్యత

మొదటి పేజీ తరువాయి





ఈ సందర్భహంగా మహిళలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంతర్జాతీయ మహిళా దినోత్సవం శుభాకాంక్షలు తెలియజేశారు ఈ సందర్భంగా 'స్టాండ్ విత్ హర్' బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. మహిళా దినోత్సవం జరుపుకుంటేనే బాధ్యత తీరిపోయినట్టు కాదన్నారు. మహిళా నాయకత్వం నుంచి వచ్చిన పార్టీ ద్వారా రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. మహిళలను శక్తితో పోలుస్తామని.. కుటుంబ గౌరవాన్ని కూడా మహిళలతో పోలుస్తామని సీఎం తెలిపారు. మహిళలకు వేధింపులు.. పట్టణాలు, కాలేజీలు, పబ్లిక్ ప్రాంతాలకు మాత్రమే పరిమితం కాలేదని.. సోషల్ మీడియాలో మహిళలు ఎక్కువగా వేధింపులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. 'మనల్ని మనం సవరించుకొని మహిళల పట్ల మన బాధ్యతల్ని నెరవేర్చాలని సీఎం సూచించారు. మహిళల రక్షణ కోసం చట్టాలు చేస్తే బాధ్యత తీరిపోయిందని అనుకోవడం తప్పని ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇళ్ల కేటాయింపులు, రేషన్ కార్డులు అన్నీ మహిళల పేర్లమీద ఇస్తోందన్నారు. తెలంగాణలో స్వయం సహాయక సంఘాల మహిళలకు సోలార్ పవర్ ఉత్పత్తి చేసి విద్యుత్ శాఖకు అమ్మే అవకాశం రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిందని తెలిపారు. ఈ నిర్ణయంతో మహిళలు అదానీ, అంబానీల స్థాయిలో విద్యుత్ రంగంలో పోటీ పడే అవకాశం ఇచ్చామన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వం పలు అవకాశాలు కల్పిస్తోందని సీఎం రేవంత్ వెల్లడించారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడం ద్వారా వారి స్వేచ్ఛ పెరిగిందని సీఎం తెలిపారు. జిల్లాల్లో ప్రభుత్వ స్థలాలు కేటాయించి మహిళల చేతుల్లో పెట్రోల్ బంకులు నిర్వహించే అవకాశాలు ఇచ్చామన్నారు. దేశంలోనే తొలిసారి మహిళా యూనివర్సిటీకి వీరనారి చాకలి ఐలమ్మ పేరు పెట్టింది తెలంగాణ ప్రభుత్వమని చెప్పారు. రాష్ట్రంలో చీఫ్ సెక్రటరీ సహా కీలక అధికార పదవుల్లో మహిళలకు అవకాశాలు కల్పిస్తున్న ప్రభుత్వం తమదే అని అన్నారు. మహిళల శక్తి, నైపుణ్యంపై ప్రభుత్వానికి సంపూర్ణ విశ్వాసం ఉందని స్పష్టం చేశారు. తెలంగాణను దేశంలోనే మహిళలకు అత్యంత భద్రత కలిగిన రాష్ట్రంగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ముఖ్యమంత్రి తెలిపారు.మహిళల రక్షణను సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని సీఎం రేవంత్ అన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగితేనే కుటుంబం, రాష్ట్రం, దేశం బలపడుతుందన్నారు. అభివృద్ధి చెందిన దేశాల్లో మహిళలు సైంటిస్టులు, డాక్టర్లు, ఇంజనీర్లుగా రాణిస్తున్నారని తెలిపారు. మహిళలు ధైర్యంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. ఎక్కడైనా మహిళలపై వేధింపులు జరిగితే నిలబడి ప్రశ్నించే ధైర్యం సమాజంలో రావాలన్నారు. కాలేజీలు, బస్టాండ్లు సహా ఎక్కడైనా జరిగే వేధింపు లను చూసీ చూడనట్టు ఉండడం కూడా నేరాన్ని ప్రోత్సహించడమే అని అన్నారు. సోషల్ మీడియా ద్వారా మహిళలపై సైబర్ వేధింపులు పెరుగుతున్నాయని తెలిపారు. మహిళలపై మార్ఫింగ్, ఫేక్ వీడియోలు వంటి సైబర్ నేరాలపై కఠిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీజీపీ శివధర్‌రెడ్డి, నగర పోలీసు కమిషనర్ సజ్జనార్, సినీ నటుడు సాయి దుర్గతేజ్ తదితరులు పాల్గొన్నారు.

# లొంగిన మావోయిస్టులకు ఆర్థిక, ఆరోగ్య భద్రత

### 130 మంది మావోయిస్టులు లొంగుబాటు

### గణపతి కూడా లొంగిపోవాలన్న రేవంత్

**హైదరాబాద్, మార్చి 7:** శాంతియుత వాతావరణంలోనే సమస్యకు పరిష్కారం దొరుకుతుందని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. లొంగిపోయిన మావోయిస్టుల ఆర్థిక, ఆరోగ్య భద్రతకు భరోసా కల్పిస్తాం. ఇంకా అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులు లొంగిపోవాలి. లొంగిపోయిన మావోయిస్టులకు అవసరమైన వసతులు కల్పిస్తాం అని అన్నారు. 130 మంది మావోయిస్టులు శనివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎదుట లొంగిపోయారు. దేవ్‌జీకి చెందిన పీఎల్‌జీఏ కమిటీ మొత్తం సరెండర్ అయిపోయింది. మావోయిస్టులు తమ ఆయుధాలను పోలీసులకు అప్పగించారు. మొత్తం 124 ఆయుధాలను సరెండర్ చేశారు. లొంగిపోయిన వారిలో దేవ్‌జీ, బడే చొక్కారావు గన్‌మెన్లు కూడా ఉన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ' మావోయిస్టుల లొంగుబాటుకు అధికారులు తీవ్ర కృషిచేశారు. పోలీసులు మావోయిస్టుల్లో నమ్మకం కల్పించారు. దేవ్‌జీ, ఆయన మిత్రబృందం కొన్ని ప్రతిపాదనలు చేశారు. తమ సమస్యలు పరిష్కరిస్తే లొంగిపోతామని చెప్పారు'. ÷రాష్ట్ర స్థాయిలో మేం చేయగలిగిందంతా చేస్తాం. మావోయిస్టు అగ్రనేత గణపతి కూడా లొంగిపోవాలి. అజ్ఞాతంలో ఉన్న తెలంగాణకు చెందిన ఏడుగురు కూడా.. త్వరగా లొంగిపోవాలి. లొంగిపోయిన వారికి పునరావాసం కల్పించాలని అమిత్ షా చెప్పారు. లొంగిపోయిన మావోయిస్టులకు రివార్డు కూడా అందజేస్తాం. ప్రత్యేకమైన ఆరోగ్య భద్రత కార్డులు ఇస్తాం' అని రేవంత్ రెడ్డి హామీ చెప్పారు. లొంగిపోయిన మావోయిస్టులకు అవసరమైన వసతులు కల్పిస్తాం. మావోయిస్టుల హోదాలను బట్టి ప్యాకేజీ కల్పిస్తాం. ఇంటి స్థలం, ఇందిరమ్మ ఇల్లు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది' అని అన్నారు. పూర్తి వివరాలు వీడియోలో చూడండి.

### ఆయుధాలను అప్పగించిన మావోలు

తెలంగాణలో మావోయిస్టుల లొంగుబాటు పరంపర కొనసాగుతోంది. ఇప్పటి వరకు తెలంగాణ పోలీసులు ముందు 721 మంది మావోయిస్టులు లొంగిపోయారు. మావోయిస్టుల నుంచి పోలీసులు ఇప్పటి వరకు 266 ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం తెలంగాణ నుంచి 7 మంది మావోయిస్టులు అజ్ఞాతంలో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. శనివారం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎదుట 130 మంది మావోయిస్టులు లొంగిపోయారు. దేవ్‌జీకి చెందిన పీఎల్‌జీఏ కమిటీ మొత్తం సరెండర్ అయిపోయింది. మావోయిస్టులు తమ ఆయుధాలను పోలీసులకు అప్పగించారు. 124 తుపాకులు, 5205 తూటాలతో సహా మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలిసి పోయారు. మావోయిస్టులు సరెండర్ చేసిన ఆయుధాలలో రైఫిళ్లు ఇతర తుపాకులు ఉన్నాయి. లొంగిపోయిన వారిలో దేవ్‌జీ, బడే చొక్కారావు గన్‌మెన్లు కూడా ఉన్నారు. ఇక, లొంగిపోయిన వారికి తెలంగాణ ప్రభుత్వం నగదు బహుమతి ఇస్తోంది. తెలంగాణ ప్రభుత్వం జనజీవన స్రవంతిలో కలిసిపోయిన డివిజనల్ కమిటీ సభ్యులకు ఐదు లక్షల రూపాయలు, ఏరియా కమిటీ సభ్యులకు నాలుగు లక్షల రూపాయలు, పార్టీ సభ్యులకు లక్ష రూపాయలు నగదు బహుమతి ప్రకటించింది. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ మార్గదర్శకాల ప్రకారం ఆయుధాలతో సహా జనజీవన స్రవంతిలో కలుస్తున్న క్యాడర్లకు అదనంగా ప్రోత్సాహకాలు అందనున్నాయి.

# 99 రోజుల్లో నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలి

- హౌసింగ్ బోర్డులోని 5వేల రిజిస్ట్రేషన్ల పక్రియ పూర్తిచేయాలి
- పోర్టల్‌ను ప్రారంభించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి




**హైదరాబాద్, మార్చి 7:** ప్రజాపాలన– ప్రగతి నివేదిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా హౌసింగ్ బోర్డు పరిధిలో పెండింగ్‌లో ఉన్న ఐదు వేల రిజిస్ట్రేషన్‌లను క్లియర్ చేస్తామని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. ప్రజలకు పారదర్శకంగా వేగవంతమైన సేవలు అందించడానికి తెలంగాణ హౌసింగ్ బోర్డు రూపొందించిన రిజిస్ట్రేషన్ పోర్టల్‌ను మంత్రి శనివారంనాడు సచివాలయంలో ప్రారంభించారు. అలాగే తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ 99 రోజుల కార్యాచరణ ప్రణాళికకు సంబంధించిన పోస్టర్‌ను కూడా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనకు అనుగుణంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి నివేదిక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ 99 రోజుల్లో హౌసింగ్ కార్పొరేషన్, హౌసింగ్ బోర్డ్ నిర్ధేశిరచుకున్న లక్ష్యాలను చేరుకునే విధంగా అంకిత భావంతో పనిచేయాలని సూచించారు. హౌసింగ్ బోర్డ్ పరిధిలో ఇండ్లు, ప్లాట్లు, స్థలాలను వాయిదాల రూపంలో కొనుగోలు చేశారని ఇందులో కొంతమంది అసలు మరికొంతమంది వడ్డీలు చెల్లించాలని, ఇంకొంతమంది వాయిదాల గడువు ముగిసిపోయిందని ఈ విధంగా దాదాపు ఐదు వేల మంది తమ ఆస్తులను రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిఉందని ఈసందర్భంగా అధికారులు మంత్రికి వివరించారు.దీనిపై మంత్రిగారు స్పందిస్తూ ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా అసలు, వడ్డీ, ప్రస్తుత మార్కెట్ ధరలు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకొని రిజిస్ట్రేషన్ చేయాలని సూచించారు. ఈ పోర్టల్ వల్ల ప్రజలు ఎవరూ అధికారుల చుట్టూ తిరగవలసిన అవసరం ఉండదని, పూర్తి సమాచారం పోర్టల్ లోనే ఉంటుందన్నారు. టాయింపుదారులు తమ రిజిస్ట్రేషన్లు, చెల్లింపుల ధృవీకరణ మరియు ఇతర లావాదేవీల పర్యవేక్షణను ఒకే వేదిక ద్వారా సులభంగా పూర్తి చేసుకోవచ్చు.డిజిటల్ విధానం వల్ల పారదర్శకత పెరగడమే కాకుండా, పౌరులకు సేవలు మరింత చేర–ువవుతాయి. ఇది హౌసింగ్ బోర్డు మరియు అలాటీల మధ్య నమ్మకాన్ని మరింత బలోపేతం చేస్తుందన్నారు. సాంకేతికతను అందిపుచ్చుకుని ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ప్రజలకు సౌకర్యవంతమైన పాలన అందించడమే ప్రభుత్వ నిబద్ధత అని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో హౌసింగ్ బోర్డు ఎండీ వీపీ గౌతమ్, సీఈ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన ఫిరాయింపు ఎమ్మెల్యేల విచారణ

### దానం , కడియంలపై తీర్పు రిజర్వ్



**హైదరాబాద్, మార్చి 7 :** తెలంగాణ రాజకీయాల్లో గత ఏడాది కాలంగా ప్రకంపనలు సృష్టిస్తున్న ఎమ్మెల్యేల ఫిరాయింపుల వ్యవహారం ఇప్పుడు చివరిదశకు చేరుకుంది. బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ లో చేరిన ఎమ్మెల్యేలపై దాఖలైన అనర్హత పిటిషన్లపై అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ శనివారం తుది విచారణను ముగించారు. సుప్రీ కోర్టు విధించిన గడువు శనివారంతో ముగియనుండటంతో, స్పీకర్ వెలువరించబోయే తీర్పుపై రాష్ట్ర వ్యాప్తంగా ఉత్కంఠ నెలకొంది. ప్రధానంగా స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్లపై దాఖలైన పిటిషన్లపై స్పీకర్ ఛాంబర్ లో కీలక విచారణ జరిగింది. ఇప్పటికే పదిమంది ఎమ్మెల్యేలను ప్రశ్నించారు స్పీకర్, అనంతరం 8 మంది ఎమ్మెల్యేలకు స్పీకర్ క్లీన్ చీట్ ఇచ్చారు. దానం, కడియం కేసులో తీర్పు రిజర్వ్ ఉంచారు. ఉభయ పక్షాల వాదనలు విన్న అనంతరం ఈ కేసులో కూడా విచారణ ముగిసినట్లు స్పీకర్ కార్యాలయం ప్రకటించింది.

# వ్యవసాయ యాంత్రీకరణకు సబ్సిడీ నిధులు

- నేరుగా రైతుల ఖాతాలోకి బదిలీ
- విధివిధానాలు తయారుచేయాలి
- ఏప్రిల్ నెలాఖరు వరకు పచ్చిరొట్ట విత్తనాలను సిద్ధం చేయాలి
- రెడ్కో సహకారంతో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు
- ఖరీఫ్ సీజన్ కోసం ముందుగానే ఎరువులు
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**హైదరాబాద్, మార్చి 7:** వచ్చే ఆర్థిక సంవత్సరం నుండి వ్యవసాయ యాంత్రీకరణకు సంబంధించిన సబ్సిడీ నిధులను నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లోకి బదిలీ చేసే విధానాన్ని అమలు చేసే అవకాశాలను పరిశీలించి, అవసరమైన విధివిధానాలను రూపొందించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ అధికారులకు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. శనివారం హైదరాబాద్‌లో వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో రానున్న ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై మంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రస్తుతం వ్యవసాయ యాంత్రికరణలో భాగంగా రైతులు కొనుగోళ్లు చేసిన పనిముట్లకు 40 శాతం సబ్సిడీ నిధులను సదరు కంపెనీలకు అందించే పద్ధతి ఉంది అలా కాక, వచ్చే ఆర్థిక సంవత్సరం నుండి సబ్సిడీ నిధులను నేరుగా రైతుల ఖాతాలోకి బదిలీ చేసే అవకాశాలను పరిశీలించి అందుకు తగ్గ విధివిదానాలను తయారు చేయాలన్నారు. రాష్ట్రంలో రైతులకు సబ్సిడీపై అందించే పచ్చిరొట్ట విత్తనాలను వచ్చే ఏప్రిల్ నెలాఖరు సిద్దంగా ఉంచుకోవాలని అందుకు తగ్గ ఏర్పాట్లు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు. అదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రైతు వేదికలలో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక రూపొందించాలని, ఇందుకు రెడ్కో సంస్థ సహకారం తీసుకోవాలని అధికారులకు సూచించారు. మొదట ప్రయోగాత్మకంగా జంగారెడ్డిపల్లి మరియు జనంపేట రైతు వేదికలలో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసి వాటి పనితీరును పరిశీలించిన తరువాత మొదటి దశలో రాష్ట్రంలోని 1600 రైతు వేదికలలో రెడ్కో ద్వారా సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ఈరానున్న ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రానికి అవసరమైన ఎరువులను ముందుగానే తెప్పించి నిల్వ ఉంచేందుకు ఇప్పటి నుంచే చర్యలు ప్రారంభించాలని మంత్రి అధికారులకు సూచించారు. ఎరువుల సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తిన కూడ ఇబ్బందులు తలెత్తకుండా రాష్ట్రానికి అవసరమైన ఎరువులను ముందుగానే సమకూర్చుకోవాలని తెలిపారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వ అధికారులతో నిరంతరం సంప్రదింపులు కొనసాగించాలని సూచించారు. ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రంలో వరి, పత్తి, మక్క వంటి ప్రధాన పంటల సాగు విస్తృతంగా జరుగుతుందని మంత్రి పేర్కొన్నారు. ముఖ్యంగా మక్క పంటకు వరి లేదా పత్తి పంటలతో పోలిస్తే యూరియా అవసరం దాదాపు మూడింతలు ఎక్కువగా ఉంటుందని చెప్పారు. నీటి నిల్వలు సమృద్ధిగా ఉండటం, నేలలో తేమ నిల్వ ఉండటం, అలాగే దక్షిణ పశ్చిమ రుతుపవనాలు సాధారణంగా ప్రారంభమవుతాయనే అంచనాల నేపథ్యంలో రానున్న ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రంలో సాగు విస్తీర్ణం సుమారు 60.60 లక్షల హెక్టార్లలో సాగు అయ్యే అవకాశం ఉందని వెల్లడించారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఖరీఫ్?2026 సీజన్‌కు రాష్ట్రానికి 11.50 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరినట్లు మంత్రి తెలిపారు.

# మహిళా సాధికారతతోనే సామాజిక మార్పు

- సైబరాబాద్‌లో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు
- ముఖ్య అతిథిగా హాజరైన జీహెచ్ఎంసీ కమిషనర్ సృజన.. పారిశుధ్య కార్మికులకు గౌరవం



**హైదరాబాద్, మార్చి 7:** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో శనివారం వేడుకలు అంబరాన్నంటాయి. 'గివ్ టు గెయిన్' థీమ్‌తో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ కమిషనర్ సృజన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో వివిధ రంగాల ప్రముఖులు, పోలీస్ అధికారులు, మహిళా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. మహిళలు ఏ రంగంలోనైనా రాణించాలంటే క్రమశిక్షణ, స్పష్టమైన లక్ష్యం, నిరంతర కృషి అవసరమని ఈ సందర్భంగా కమిషనర్ సృజన పేర్కొన్నారు. తన తండ్రి బాలరామయ్య స్ఫూర్తితో సివిల్ సర్వీసెస్ వైపు అడుగులు వేసి, యూపీఎస్సీలో 44వ ర్యాంక్ సాధించిన విధానాన్ని వివరిస్తూ, యువత తమపై తాము నమ్మకం ఉంచితే ఎంతటి కఠినమైన లక్ష్యాన్నైనా సులభంగా సాధించవచ్చని ఆమె సూచించారు. సమాజంలో మహిళల ఆరోగ్యమే కుటుంబానికి పునాది అని పేర్కొంటూ, ప్రకృతి వ్యవసాయం మరియు పోషకాహారంపై వక్తలు అవగాహన కల్పించారు. 'సేవ' ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు విజయ్ రామ్ మాట్లాడుతూ రసాయన రహిత ఆహారం తీసుకోవాలని, సుభాష్ పాలేకర్ విధానాలను అనుసరిస్తూ ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లాలని పిలుపునిచ్చారు. ప్రముఖ పోషకాహార నిపుణులు డాక్టర్ నిదా ఫాతిమా మాట్లాడుతూ శారీరక శక్తితో పాటు మెదడు పనితీరుకు, మానసిక ప్రశాంతతకు పోషక విలువలున్న ఆహారం ఎంతో అవసరమని వివరించారు. అలాగే కౌమార దశలో ఉన్న పిల్లల మానసిక వికాసంపై కన్సల్టెంట్ హరిణి తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన మహిళా అధికారులతో పాటు, నగరాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్న మియాపూర్, పటాన్‌చెరు, నిజాంపేట్, మాదాపూర్ ప్రాంతాల మహిళా పారిశుధ్య కార్మికులను వేదికపై ఘనంగా సన్మానించారు. ఏఎస్ఐ వనజ నేతృత్వంలో జరిగిన యోగా ప్రదర్శన, శ్రీలత–శ్రీకృష్ణల గీతాలాపన అలరించాయి. కమిషనరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఎక్స్‌పోలో చేనేత వస్త్రాలు, అలంకరణ వస్తువులు, పోషకాహార స్టాల్స్ సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో డీసీపీలు కోటి రెడ్డి, శ్రీనివాస్, అన్నపూర్ణ, ముత్యం రెడ్డి, సుధీంద్ర, సృజన కరణం, సంజీవ్, సాయి మనోహర్ మరియు ఇతర పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# వైభవంగా ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలు

## మాట నిలబెట్టుకున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం: షబ్బీర్ అలీ

**కామారెడ్డి, మార్చి 7:** పేదవాడి సొంతింటి కల సాకారం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీ అన్నారు. శనివారం కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాన్ని ఆయన జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌తో కలిసి ప్రారంభించారు. గ్రామానికి చెందిన భిక్కనూర్ లక్ష్మి, చిట్యాల రాజమణిలకు నిర్మించిన ఇళ్లలో శాస్త్రోక్తంగా గృహప్రవేశాలు నిర్వహించి, వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన పాదయాత్ర సమయంలో కూలిపోయిన ఇళ్లను చూసి చలించిపోయారని, అధికారంలోకి రాగానే ఇళ్లు నిర్మించి ఇస్తానని ఇచ్చిన హామీని నేడు నిలబెట్టుకున్నారని కొనియాడారు. ఇచ్చిన మాట ప్రకారం నిర్మాణాలు పూర్తి చేసి గృహప్రవేశాలు చేయించడం ప్రభుత్వం ప్రజల పట్ల ఉన్న నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు లబ్ధిదారులకు



నిత్యావసర సరుకులు, వస్త్రాలను అందజేశారు. అనంతరం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీతక్కతో ఫోన్ ద్వారా మాట్లాడించగా, ఆమె లబ్ధిదారులకు తన శుభాకాంక్షలు తెలియజేశారు.

# పోలీసులతో టచ్‌లో మావో అగ్రనేత గణపతి?

- లొంగిపోవాలని ఇప్పటికే సీఎం, డీజీపీల వినతి



**హైదరాబాద్, మార్చి 7:** మావోయిస్టు అగ్రనేత గణపతి తెలంగాణ పోలీసుల టచ్‌లోకి వచ్చాడరిన సమాచారం. నిజానికి శనివారం లొంగిపోతాడని ప్రచారం జరిగింది. కానీ అలా జరగలేదు. అయితే వారం, పది రోజుల్లో గణపతి లొంగిపోయే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. పోలీస్ బృందం నేపాల్, ఫిలిప్పీన్స్ వెళ్లనుంది. గణపతి పోలీసుల ముందు లొంగిపోతే రక్షణ కల్పిస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. శనివారం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎదుట 130 మంది మావోయిస్టులు లొంగిపోయారు. దేవ్‌జీకి చెందిన పీఎల్‌జీఏ కమిటీ మొత్తం సరెండర్ అయిపోయింది. మావోయిస్టులు తమ ఆయుధాలను పోలీసులకు అప్పగించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా మావోయిస్టు అగ్రనేత గణపతి లొంగిపోవాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి పిలుపు ఇచ్చిన గంటల్లోనే గణపతి పోలీసుల టచ్‌లోకి వచ్చాడంటూ వార్తలు రావటం గమనార్హం. ఇకపోతే నేటితో తెలంగాణ మావోయిస్ట్ రాష్ట్ర కమిటీ అంతర్థానమైంది డీజీపీ శివధర్ రెడ్డి అన్నారు. తెలంగాణకు చెందిన 7 మంది మావోయిస్టులు మాత్రమే మిగిలి ఉన్నారని, ఆ ఏడు మంది తెలంగాణలో కాకుండా వివిధ రాష్ట్రాల్లో పనిచేస్తున్నారని వెల్లడించారు. శనివారం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎదుట 130 మంది మావోయిస్టులు లొంగిపోయారు. దేవ్‌జీకి చెందిన పీఎల్‌జీఏ కమిటీ మొత్తం సరెండర్ అయిపోయింది. మావోయిస్టులు తమ ఆయుధాలను పోలీసులకు అప్పగించారు. ఈ సందర్భంగా డీజీపీ శివధర్ రెడ్డి మాట్లాడుతూ.. 'మావోయిస్టు అగ్రనేత గణపతి అజ్ఞాతంలో ఉన్నారు. ఆయన అనారోగ్య కారణాలతో అజ్ఞాతంలో ఉన్నట్టు సమాచారం ఉంది. లొంగిపోవాలని గణపతికి విజ్ఞప్తి చేస్తున్నాము. మావోయిస్టు అగ్ర నేతలు లొంగిపోవడంతో.. రాష్ట్ర కమిటీ నేతలు, కమిటీ సభ్యులు కూడా లొంగిపోవడానికి ముందుకు వస్తున్నారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని లొంగిపోవడానికి స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారని అన్నారు. ప్రస్తుతం లొంగిపోయిన 130 మందిని వివిధ ప్రాంతాల నుండి తీసుకుని వచ్చాం. 130 మందిని ఒక చోట చేర్చడానికి మా డిపార్ట్‌మెంట్ తీవ్రంగా శ్రమించింది. లొంగిపోయిన మావోయిస్టులకు నిబంధనలకు అనుగుణంగా పునరావాసం కల్పిస్తాం' అని అన్నారు.



# రైతుబంధు ఇంకా ఎప్పుడిస్తారు

## మూడు పంటలకని చెప్పి ఒక్కటి కూడా ఇవ్వరా

## కరీంనగర్ జిల్లాలో పర్యటించిన హరీష్ రావు

**కరీంనగర్, మార్చి 7:** తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుబంధు ఇచ్చే తెలివి లేదా అని ప్రశ్నించారు. మూడు పంటలకు రైతుబంధు ఇవ్వాలని గతంలో ఆయన చెప్పారని.. కానీ ఇప్పుడు తన హయాంలో మూడు పంటలకు రైతుబంధు ఎగొట్టారని ధ్వజమెత్తారు. శనివారం కరీంనగర్ జిల్లాలోని చొప్పదండి నియోజకవర్గం గోపాలరావుపల్లిలో హరీశ్‌రావు పర్యటించారు. గోపాలరావుపల్లిలో పంట పొలాలను పరిశీలించారు. సాగునీరు లేక అన్నదాతలు పడుతున్న కష్టాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులతో ముఖాముఖిలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ నేతలు ఏ మొహం పెట్టుకుని రైతుల దగ్గరకు పోతారు....? అని హరీశ్‌రావు నిలదీశారు. పోలీసులు లేకుండా జనం దగ్గరకు ఎమ్మెల్యేలు, మంత్రులు వెళ్లగలరా..? అని ప్రశ్నల వర్షం కురిపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు కూలిందని కాంగ్రెస్ నేతలు చిల్లర మాటలు మాట్లాడుతారా..? అని ధ్వజమెత్తారు. కాళేశ్వరం ప్రాజెక్టు వల్లే పంటలు పండుతున్నాయని స్పష్టం చేశారు. హైదరాబాద్‌కు తాగునీటిని అందించేది కాళేశ్వరం నీళ్లేతోనేనని తేల్చిచెప్పారు. తమపై చిల్లర వ్యాఖ్యలను బంద్ చేయాలని.. లేకపోతే తాము ఊరుకోమని హెచ్చరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు కూలిందని అడ్డగోలు ఆరోపణలు చేస్తారా..? అని ఆగ్రహించారు. ఈ ప్రాజెక్టును ఎండబెట్టాలని చూస్తున్నారని మండిపడ్డారు. మేడిగడ్డ పిల్లర్లను రేవంత్‌రెడ్డి సర్కార్ వెంటనే రిపేర్ చేయాలని డిమాండ్ చేశారు. రెండేళ్లలో కనీసం పది వేల ఎకరాలకు నీరిచ్చారా....? అని హరీశ్‌రావు ప్రశ్నల వర్షం కురిపించారు.

# కామారెడ్డిలో చిన్నారుల మిస్సింగ్ కలకలం

## పదేళ్ల లోపు ఐదుగురు చిన్నారులు అదృశ్యం

## రంగంలోకి దిగిన పోలీసులు



**కామారెడ్డి, మార్చి 7:** కామారెడ్డి పట్టణంలోని గంటల వ్యవధిలోనే చిన్నారుల మిస్సింగ్ కలకలం రేపుతోంది. 24 గంటల వ్యవధిలో ఐదుగురు చిన్నారులు అదృశ్యం కావడం ఆందోళనకు గురిచేస్తోంది. అదృశ్యం అయిన వాళ్ళంతా 10 ఏళ్ల లోపు పిల్లలే. కామారెడ్డి పట్టణంలోని సంగి కాలనీకి చెందిన సింహాద్రి(10), విజయ్(9) అనే ఇద్దరు చిన్నారులు శుక్రవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. సాయంత్రం దాటినా పిల్లలు రాకపోవడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. మరోవైపు.. ఆర్బీ నగర్ కాలనీకి చెందిన అక్కాచెల్లెళ్లు అదృశ్యం కావడం మరింత భయాందోళనకు గురిచేస్తోంది. సీపాత్(8), అయాత్(7), మరియం(5) అనే ముగ్గురు పిల్లలను వారి తండ్రి ఆటోలో తీసుకువెళ్లి ఒక షాపు వద్ద వదిలిపెట్టాడు. కొద్దిసేపటి తర్వాత తిరిగి వచ్చి చూసేసరికి అక్కడ వాళ్లు కనిపించకుండా పోయారు. చిన్నారు అదృశ్యంపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు పోలీసులు. బాధిత కుటుంబాల ఇంటికి వద్దకు వెళ్లిన కామారెడ్డి అడిషనల్ ఎస్పీ చైతన్య రెడ్డి వివరాలు సేకరించారు. కామారెడ్డి పట్టణ సీఐ నరహరి, కామారెడ్డి రూరల్ సీఐ రామన్ ఆధ్వర్యంలో పోలీసులు 3 బృందాలుగా ఏర్పడి సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు.

# సివిల్స్‌లో ఓబీసీ అభ్యర్థులకు ర్యాంకులు

## అభినందించిన తెలంగాణ వెనుకబడిన తరగతుల కమిషన్



**హైదరాబాద్, మార్చి 7:** ఇటీవల విడుదలైన సివిల్ పరిక్షా ఫలితాల్లో తెలంగాణకు చెందిన 20 మంది అభ్యర్థులకు మంచి మార్కులు రావటం, అందులో 10 మంది అభ్యర్థులు ఓబీసీ వర్గానికి చెందినవారు కావడం ఎంతో సంతోషదాయకమని తెలంగాణ బీసీ కమిషన్ అభివర్ణించింది. బీసీ కమిషన్ ఛైర్మన్ జి. నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, రంగు బాలలక్ష్మి తెలంగాణ నుండి మంచి ర్యాంకులు సాధించిన 20 మంది అభ్యర్థులకు అభినందనలు తెలిపారు. తెలంగాణ నుండి మంచి ర్యాంకులు వచ్చిన 20 మందిలో 10 మంది బీసీ వర్గాలకు చెందిన వారు కావడం బీసీల్లో విద్యాపరంగా కలుగుతున్న చైతన్యానికి నిదర్శనం అని పేర్కొన్నారు.



సంపాదకీయం

# మహిళలకు వందనాలు!

భారతీయ సంస్కృతిలోనే స్త్రీలకు అత్యంత గౌరవం ఉంది. అనాదిగా స్త్రీని పరమ పూజ్యనీయంగా చూసే వారు. అందుకేనేమో మన ఇతిహాసంలో మహిళనే ఎక్కువగా గౌరవించేవారు. సతీ అనసూయ, సతీ అరుంధతి, సీత, సావిత్రి, ద్రౌపది ఇలా గౌరవప్రదమైన స్థానాల్లో స్త్రీలు ఉండేవారు. అమ్మవారిగా కూడా కాళీ, లక్ష్మి, సరస్వతి, దుర్గా ఇలా పూజలు నిర్వహించేవారం. నదులకు కూడా గంగా, యమున, సరస్వతి, గోదావరి, కృష్ణ, పేర్లతో గౌరవించుకున్నాం. ఇంతటి ఉత్కృష్టత కలగిన మన చరిత్ర నుంచి మనం పక్కకు తప్పుకున్నామా అన్న బాధ కలుగుతోంది. స్త్రీని స్త్రీగా కాకుండా ఆటవస్తువుగా, భోగవస్తువుగా చూస్తున్న తీరుకు తలదించుకోవాలి. స్త్రీకి ఇప్పుడు గౌరవంగా చేస్తున్నందుకు సిగ్గుపడాలి. యత్రనార్యంతు పూజ్యంతే.. అన్న ఆర్యోక్తికి భిన్నంగా మన ప్రవర్తన, మన నడత మారడం ఆందోళనకరం. ప్రతియేటా అంతర్జాతీయ మహిళా దినోత్సవారుల జరుపుకుంటున్నా మార్పులు రావడం లేదు. సమాజంలో మృగాళ్లు విజృంభిస్తున్నారు. కఠిన చర్యలు తీసుకోక పోవడం కూడా ఓ కారణం. మన సమాజం గతంలో ఇచ్చిన గౌరవాన్ని మళ్లీ పునరుద్దరించుకోవాల్సి ఉంది. మహిళలకు అన్నరంగాల్లో పెద్దపీట వేసేలా ప్రతిన తీసుకోవాలి. ఏటా అంతర్జాతీయ దినోత్సవాలను కాకుండా నిత్యం మనమంతా మహిళలను గౌరవించేలా మన సమాజాన్ని మార్చుకోవాలి. మొదట అంతర్జాతీయ మహిళా శ్రామిక దినోత్సవంగా పిలిచేవారు. వివిధ ప్రాంతాలలో ఈ ఆచరణ మహిళలకు గౌరవం, గుర్తింపు నిస్తోంది. ప్రేమల గురించిన సాధారణ ఉత్సవం నుండి మహిళల ఆర్థిక, రాజకీయ, సామాజిక సాధనల ఉత్సవంగా వుంటుంది. సామ్యవాద రాజకీయ ఘటనగా ప్రారంభమై, వివిధ దేశాల్లో, ముఖ్యంగా తూర్పు ఐరోపా, రష్యా, పూర్వ సోవియట్ సమూహపు దేశాల సంస్కృతుల్లో భాగమైంది. ఇంకొన్ని ప్రాంతాలలో ఐక్యరాజ్యసమితి ఉద్దేశించిన విధంగా రాజకీయ, మానవీయ హక్కులు బలంగా వుండి ప్రపంచవ్యాప్తంగా మహిళల రాజకీయ, సామాజికహక్కుల పోరాటంపై జాగృతి పెంచే విధంగా జరుపుతారు. ఈ రోజున కొంతమంది వంకాయ రంగు రిబ్బనులు ధరిస్తారు. ఓ వ్యక్తి జీవితంలో స్త్రీ చాలా పాత్రలు పోషిస్తుంది. తల్లి మొదలు, చెల్లి, భార్య, గురువు ఇలా ఎన్నో బాధ్యతలను ఆమె అలవోకగా చేయగలదు. ఆమెలోని గొప్పదనం ఏంటంటే ఓ వైపు ఇంటిని చక్కబెడుతూనే మరోవైపు సంఘంలోనూ ఎన్నో పాత్రల్లో బాధ్యతగా ఇమిడి పోతోంది. సమాజంలో మగవారితో సమానంగా టీచర్, ఇంజనీర్, పైలెట్ వంటి బాధ్యతలను కూడా ఆమె స్వీకరించి వందశాతం వాటికి న్యాయం చేస్తుంది. అంతెందుకు యుద్దరంగంలోనూ మహిళ సమర్థంగా తన బాధ్యతలను నిర్వహిస్తోంది. అంటే ఆమెకు ప్రోత్సాహం అందిస్తే ..ఎంతటి పాత్రను అయినా అవలీలగా పోషించే శక్తి మహిళ సొంతం. నేటి కాలంలో స్త్రీలు సాధించిన విజయాలు నిజంగా ఆకాశాన్నంటాయి. వీటన్నింటికి ప్రతీకగా ప్రపంచంలోని మహిళల కోసం 'అంతర్జాతీయ మహిళా దినోత్సవం'ని ఏర్పాటు చేశారు. ముందుకాలంతో పోల్చితే రోజురోజుకి మహిళలు ముందుకు సాగుతున్నారు. దేశ ఆర్థికాభివృద్ధిలో వారి పాత్ర కీలకం. ప్రతి సంవత్సరం మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుగుతుంది. ఈ రోజున వారు సాధించిన విజయాలకి గుర్తుగా వారిని గౌరివించే రోజు. నేడు అన్ని రంగాల్లోనూ ముందున్న మహిళలు.. తమ అద్భుత తెలివి, ఆలోచించే విధానంతో రోజురోజుకి పురోగతి సాధిస్తున్నారు. 1909 ఫిబ్రవరి 28న జాం న్యూయార్క్ నగరంలో అమెరికన్ సోషలిస్ట్ పార్టీ జాతీయ మహిళా దినోత్సవం జరుపుకుంది. కార్మిక కార్యకర్త థెరిసా మల్కెయిల్ నగరంలోని రెడీమెడ్ గార్మెంట్స్ కార్మికులపై జరుగుతున్న అణచివేతని ఖండిస్తూ ఈ దినోత్సవాన్ని ప్రారంభించారు. దీని ప్రాముఖ్యతని చూసి ముగ్ధులైన అమెరికన్ సోషలిస్ట్ నాయకులు మహిళా దినోత్సవాన్ని ఎందుకు జరుపుకోవాల్సిన అవసరం ఉందో చెప్పారు. కానీ, ఆ టైమ్‌లో ప్రత్యేకమైన రోజుని అనుకోలేదు. ఈ నేపథ్యంలో 1975, 1977లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఐరాస నిర్వహించింది. సంస్థ సంబరాలు ప్రారంభించి మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా ప్రకటించింది. ఈ రోజున మహిళల హక్కులని కాపాడి, వారు శాంతియుతంగా జీవించేందుకు చర్యలు తీసుకోవాలని కట్టుబడి ఉంది.లింగ సమానత్వాన్ని జరుపుకుంటారు. ఈ రోజున వివిధ రంగాల్లో విజయాలు సాధించిన మహిళల్ని గుర్తించి వారికి గౌరవిస్తారు. సాంఘిక, రాజకీయ, సాంస్కృతిక కార్యక్రమాల్లో స్త్రీ, పురుషులు సమానమని చెప్పడమే ముఖ్య ఉద్దేశ్యం.ఇక ఈ రోజున ప్రత్యేకమైన కొన్ని రంగుల దుస్తులు కూడా ధరిస్తారు. ఎక్కువగా ఊదారంగు(పర్పుల్), ఆకుపచ్చ, తెలుపు రంగుల వస్త్రాలని ధరిస్తారు. ఇక్కడ పర్పుల్ అంటే ఊదా రంగా న్యాయ, గౌరవానికి సూచనగా, ఆకుపచ్చ రంగు హామిని ఇస్తుంది. ఇక తెలుపు స్వచ్ఛతకి సూచనగా ధరిస్తారు. అదే విధంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఏ దేశానికి, సంస్థ, సంఘానికి మాత్రమే పరిమితం కాలేదు. ప్రపంచ వ్యాప్తంగా దీనిని జరుపుకుంటారు. అమ్మ, గురువు, అక్క, చెల్లి,భార్య, ఇలాంటి ఎన్నో ముఖ్య పాత్రలు పోషిస్తున్న వారందరికీ ఈ రోజున కృతజ్ఞతలు అదే విధంగా అభినందనలు తెలపడం మన బాధ్యత. విధి. దీని వల్ల వారు అందించిన సేవలని మీరు గుర్తించినట్లుగా అవుతుంది. అందుకే మనమంతా మాతృమూర్తి అయిన స్త్రీలను గౌరవించడం అలవాటు చేసుకోవాలి. ఇంటినుంచే ఈ ఆచారం రావాలి. సమాజంలో ఆమె గౌరవాన్ని కాపాడాలి. అప్పుడే మన సంస్కృతిని ముందుకు తీసుకుని పోగలం. అంతేగాకుదు మహిళ లేకుంటే మనుగడ లేదని, సృష్టి లేదని గుర్తించాలి.

# ట్రంప్ తదితరుల హత్యకు ప్లాన్

- ఇరాన్ ప్రోద్బలంతో రంగంలోకి ఆసిఫ్ మర్చంట్
- పాకిస్థానీని దోషిగా తేల్చిన స్థానిక కోర్టు





**న్యూయార్క్, మార్చి 7:** డోనాల్డ్ ట్రంప్‌ను హత్య చేసేందుకు ప్లాన్ చేసిన కేసులో పాకిస్థానీ వ్యక్తిని అమెరికా న్యాయశాఖ శుక్రవారం దోషిగా తేల్చింది. ఇరాన్ ఆదేశాల ప్రకారం అతను అమెరికా రాజకీయ వేత్తలను హత్య చేసేందుకు ప్లాన్ చేసినట్లు అమెరికా న్యాయశాఖ ఆరోపించింది. నిందిత వ్యక్తిని ఆసిఫ్ మెర్చంట్‌గా గుర్తించారు. 2020లో ఇరాన్ మిలిటరీ నేత ఖాసిమ్ సొలేమని హత్యకు ట్రంప్ ఆదేశించారు. ఈ నేపథ్యంలో ట్రంప్‌తో పాటు కొందరు అమెరికా నేతలను హత్య చేయాలని ఆసిఫ్ మెర్చంట్ ప్లాన్ చేశారు. దీని కోసం అమెరికాలో కొందర్ని రిక్రూట్ చేసేందుకు అతను ప్లాన్ చేశాడు. ఆసిఫ్ టార్గెట్‌లో ట్రంప్‌తో పాటు జో బైడెన్, నిక్కీ హేలీ కూడా ఉన్నారు. ఇరాన్ అధికారుల ఆదేశాల ప్రకారం అమెరికా నేతల హత్య కోసం ఆసిఫ్ రిక్రూట్మెంట్‌కు పాల్పడ్డాడని, దీన్ని ఉగ్రవాద చర్యగా భావిస్తున్నామని అమెరికా న్యాయశాఖ పేర్కొన్నది. న్యూయార్క్ సిటీ కోర్టు ఈ కేసుపై గత వారం వాదనలు జరుగుతున్నాయి. అయితే ఇరాన్‌లోని ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్‌తో కలిసి హత్యలకు ప్లాన్ చేసినట్లు ఆసిఫ్ మర్చెంట్ అంగీకరించాడు. అయితే టెహ్రాన్‌లో ఉన్న తన ఫ్యామిలీని కాపాడుకోవాలన్న భయంతో ఆ పనిచేసినట్లు చెప్పాడు. ఇరాన్ టాప్ కమాండర్ ఖాసీం సులేమాని హత్యకు ప్రతీకారంగా.. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తో సహా ఇతర రాజకీయ నేతల హత్యకు కుట్రలు జరిగిన సంగతి తెలిసిందే. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటోన్న పాకిస్థాన్ వ్యాపారి ఆసిఫ్ మర్చంట్ ను యూఎస్‌లోని బ్రూక్లిన్ న్యాయస్థానం దోషిగా తేల్చింది. ఈ మేరకు తాజాగా తీర్పు వెలువరించింది. ఇరాన్‌తో సంబంధాలున్న అతడికి ఈ కుట్ర కేసులో జీవిత ఖైదు పడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ వద్ద ఆసిఫ్ మర్చంట్ శిక్షణ పొందినట్లు రుజువైందని అమెరికా న్యాయస్థానం పేర్కొంది. ప్రముఖ రాజకీయ నాయకుల హత్య కోసం ఐఆర్‌జీసీ తనను 2024లో అమెరికాకు పంపించిందని అతడు విచారణలో అంగీకరించాడు. అయితే, తుది లక్ష్యం ఎవరనేది తనకు వెల్లడించలేదని తెలిపాడు. ఈ క్రమంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్, మాజీ అధ్యక్షుడు జో బైడెన్ , 2024 అధ్యక్ష రేసులో ఉన్న నిక్కీ హేలితో సహా పలువురు కీలక రాజకీయ నేతలు తమ టార్గెట్‌లో ఉన్నట్లు పేర్కొన్నాడు. అయితే, ఈ ఆరోపణలను ఇరాన్ గతంలోనే ఖండించింది. ఈ హత్య కుట్రతో తమకు సంబంధం లేదని తెలిపింది. పాకిస్థాన్‌లోని పలు బ్యాంకుల్లో కొన్నేళ్ల పాటు పనిచేసిన ఆసిఫ్.. ఆ తర్వాత వస్త్ర వ్యాపారంలోకి అడుగుపెట్టాడు. అతడికి పాక్‌లో వివాహం కాగా.. ఇరాన్‌కు చెందిన మహిళనూ పెళ్లి చేసుకున్నట్లు తెలిసింది. 2024 ఏప్రిల్‌లో అమెరికాకు వచ్చిన ఆసిఫ్.. కిరాయి హంతకుల ఏర్పాటు కోసం ఓ వ్యక్తితో తన ప్రణాళిక గురించి చర్చించాడు. అయితే, ఆ వ్యక్తి అండర్‌కవర్‌లో ఉన్న అధికారిగా సమాచారం. అధ్యక్ష ఎన్నికల సమయంలో పెన్సిల్వేనియాలో ట్రంప్‌పై హత్యాయత్నం జరిగిన సంగతి తెలిసిందే. దీనికి ఒకరోజు ముందు అండర్‌కవర్ అధికారి సమాచారం మేరకు.. ఆసిఫ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. పాక్‌కు పారిపోయేందుకు విమానం ఎక్కడానికి సిద్ధమవుతుండగా అతడిని పట్టుకున్నారు.

# మా దాడులు ఉద్దేశ్యపూర్వకం కాదు

## గల్ఫ్ దేశాలకు ఇరాన్ అధ్యక్షుడి క్షమాపణలు



**టెహ్రాన్, మార్చి 7:** గల్ఫ్ దేశాలకు ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజిష్కియాన్ క్షమాపణలు చెప్పారు. ఇరుగుపొరుగు దేశాలపై క్షిపణలు, డ్రోన్ దాడులు చేసే ఉద్దేశం తమకు లేదని చెప్పారు. అయితే ఆయా దేశాలు తమ భూభాగాల నుంచి ఇరాన్‌పై దాడిని ప్రారంభించకుంటే తాము కూడా దాడి చేయమని అన్నారు. ఇరాన్ తాత్కాలిక నాయకత్వ మండలి ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలు లక్ష్యంగా ఇరాన్ దాడులు కొనసాగిస్తున్న నేపథ్యంలో ఆ దేశం తాజా ప్రకటనతో ఉద్రిక్తతలు సడలే అవకాశం ఉంది. ఘర్షణల కారణంగా పొరుగుదేశాల్లో అనిశ్చితి తలెత్తడంపైనా పెజిష్కియాన్ క్షమాపణలు చెప్పారు. గల్ఫ్ ప్రాంతంలో సంక్షోభం మరింత విస్తరించాలని ఇరాన్ కోరుకోవడం లేదని అన్నారు. 'ఇరాన్ జరిపిన దాడులకు పొరుగు దేశాలకు వ్యక్తిగతంగా, ఇరాన్ తరపున క్షమాపణలు తెలియజేసుకుంటున్నాను' అని ఆయన పేర్కొన్నట్టు ఏఎఫ్‌పీ వార్తా సంస్థ తెలిపింది. పొరుగుదేశాలపై దాడులు చేయమని ఇరాన్ అధ్యక్షుడు ఓవైపు చెబుతూనే మరోవైపు అమెరికా-ఇజ్రాయెల్ ఒత్తిళ్లకు తలవంచే ప్రసక్తే లేదని చెప్పారు. ఇరాన్ ప్రజలు ఎన్నడూ లొంగిపోరని, ఇరాన్‌ను లొంగదీసు కోవచ్చని అనుకునే వాళ్లు ఎప్పటికీ సక్సెస్ కారని, తమ దేశాన్ని తాము కాపాడుకుంటామని మీడియాతో మాట్లాడుతూ ఆయన చెప్పారు. కాగా, పొరుగుదేశాలపై దాడి చేయమని ఇరాన్ అధ్యక్షుడు ప్రకటించిన ప్పటికీ గల్ఫ్ ప్రాంతంలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. దుబాయ్, అబుదాబి వంటి ప్రధాన నగరాల్లో పేలుళ్లు వినిపిస్తున్నాయి. క్షిపణులు, డ్రోన్‌లను ఎయిర్ డిఫెన్స్ సిస్టంలు అడ్డుకుంటున్న శబ్దాలు వినిపిస్తున్నాయి. విమానాశ్రయం సమీపంలో పెద్ద శబ్దం వినిపించడంతో దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆపరేషన్లను శనివారం నాడు నిలిపివేశారు. ఇది చిన్న ఘటనేనని, అయితే ప్రయాణికుల భద్రత రీత్యా విమాన సర్వీసులను రద్దు చేశామని అధికారులు తెలిపారు. తాజా ఘర్షణల్లో ప్రాణనష్టం కూడా భారీగానే ఉన్నట్టు చెబుతున్నారు. ఇరాన్‌లో 1,200మంది ప్రాణాలు కోల్పోగా, లెబనాన్‌లో సుమారు 200 మంది ఇజ్రాయెల్‌లో డజను మంది ప్రాణాలు కోల్పోయారు. ఉద్రిక్తతల నేపథ్యంలో ఆరుగురు అమెరికా సైనికులు మరణించినట్టు చెబుతున్నారు. గల్ఫ్ వ్యాప్తంగా ఎయిర్ ట్రావెల్‌కు అంతరాయం కలగడంతో వేలాది విమానాలు రద్దవుతున్నాయి. క్షిపణులు, డ్రోన్ దాడుల భయంలో పలు దేశాలు తమ గగనతలాన్ని మూసివేశాయి.



# గూగుల్ సీఈఓ పిచాయ్‌కు భారీ జీతం

## కంపెనీ లాభాల దృష్ట్యా 692 మిలియన్ డాలర్లకు పెంపు

**న్యూయార్క్, మార్చి 7:** గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ నాయకత్వంలో అల్ఫాబెట్ మార్కెట్ విలువ పైపైకి దూసుకెళుతోంది. కంపెనీ భారీ మె-ంత్తంలో లాభాలు గడిస్తోంది. గతంలో 535 బిలియన్ డాలర్లు ఉన్న మార్కెట్ విలువ ఇప్పుడు 3.6 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంది. ఈ నేపథ్యంలో కంపెనీ ఉన్నతి కోసం ఎంతగానో కృషి చేస్తున్న సుందర్ పిచాయ్‌కి అల్ఫాబెట్ శుభవార్త చెప్పింది. తాజాగా, భారీ మొత్తంలో ప్యాకేజీని ప్రకటించింది. ది ఫైనాన్షియల్ టైమ్స్ శనివారం తెలిపిన వివరాల మేరకు.. పిచాయ్ ప్యాకేజీని రానున్న మూడేళ్లలో 692 మిలియన్ డాలర్లకు పెంచుతూ అల్ఫాబెట్ కీలక నిర్ణయం తీసుకుంది. మన ఇండియన్ కరెన్సీలో దాని విలువ 6,361 కోట్ల రూపాయలు. 692 మిలియన్ డాలర్లలో పిచాయ్ జీతం కేవలం 2 మిలియన్ డాలర్లు మాత్రమే. మిగిలినదంతా పనితీరు ఆధారిత స్టాక్స్ , పరిమిత స్టాక్స్ రూపంలో ఉండనుంది. పిచాయ్‌కి ఇచ్చే పనితీరు ఆధారిత స్టాక్స్ విలువ 126 మిలియన్ డాలర్లుగా ఉంది. పరిమిత స్టాక్స్ ద్వారా పిచాయ్ 84 మిలియన్ డాలర్లు అందుకోనున్నారు. అల్ఫాబెట్ అనుబంధ సంస్థలు వ్యామోలో 130 మిలియన్ డాలర్ల విలువైన షేర్స్.. వింగ్ ఏవియేషన్‌లో 45 మిలియన్ డాలర్ల విలువైన షేర్లను యజమాన్యం కేటాయించింది. పిచాయ్ నాయకత్వం మీద ఉన్న నమ్మకంతోటే ప్యాకేజీ భారీగా పెంచినట్లు అల్ఫాబెట్ బోర్డ్ పేర్కొంది. కాగా, 53 ఏళ్ల సుందర్ పిచాయ్ 2004లో అల్ఫాబెట్‌లో ఉద్యోగంలో చేరారు. క్రోమ్‌ను అభివృద్ధి చేయటంలో కీలక పాత్ర పోషించారు. అంచెలంచెలుగా ఎదిగి గూగుల్ సీఈఓ స్థానానికి చేరుకున్నారు.

# ఖమేనీ నలుగురు కుమారులు క్షేమం

## ఆన్‌లైన్‌లో ఫోటోలు విడుదల

**టెహ్రాన్, మార్చి 7:** ఇజ్రాయెల్ తొలి దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లి అలీ ఖమేనీ మృతి తీవ్ర సంచలనమైంది. దీంతో మధ్యప్రాచ్యంలో ఒక్కసారిగా ఉద్రిక్తతలు తలెత్తాయి. ఇజ్రాయెల్ దాడుల్లో ఖమేనీపాటు ఆయన కొడుకుల్లో ఒకరు మృతి చెందినట్టు తొలి వార్తలు వచ్చాయి. అయితే తాజా సమాచారం ప్రకారం ఆయన కుమారులు నలుగురు క్షేమంగా ఉన్నారు. ఇందుకు సంబంధించిన ఫోటోలు ఆన్‌లైన్‌లో హల్‌చల్ చేస్తున్నాయి. ఖమేనీ మరణించినప్పటికీ ఆయన నలుగురు కొడుకులైన ముస్తాఫ్ ఖమేనీ, మొజ్తబా ఖమేనీ, మసూదు ఖమేనీ, మెయిసమ్ ఖమేనీలు సురక్షిత ప్రాంతంలో ఉన్నట్టు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరుగుతోంది. వారి ఫోటోలు సర్క్యులేట్ అవుతున్నాయి. ఖమేనీ మృతి తర్వాత సుప్రీం లీడర్ ఎంపిక కోసం అన్వేషణ జరుగుతున్న తరుణంలో ఫోటోలు విడుదల కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఖమేనీ తన వ్యక్తిగత జీవితాన్ని ఎప్పుడూ రహస్యంగా ఉంచేవారు. అరుదుగా మాత్రమే ఆయన తన భార్య, కుమారులతో కనిపించే వారు. క్రియాశీలక రాజకీయాలకు కుమారులను దూరంగా ఉంచేవారు. ఆయన కుటుంబంలోని ఒకరిద్దరు మాత్రమే రాజకీయాల్లో ప్రభావం కనబరచే వారని చెబుతుంటారు. ఖమేనీ భార్య మన్సూరే ఖోజస్తే బాఘెర్జాదే ఎప్పుడూ ప్రచారానికి దూరంగానే ఉండేవారు. ఇరాన్‌లోని ఓ ప్రముఖ వ్యాపారి కుటుంబంలో 1947లో ఆమె జన్మించారు. 1964 ఖొమేనీని వివాహమాడారు. ఇరాన్‌లోని తలెత్తిన ఇస్లామిక్ విప్లవంతో సహా ఇరాన్ రాజకీయ చరిత్రలో సంక్లిష్ట పరిస్థితి ఏర్పడినప్పుడల్లా ఖమేనీకి ఆమె బాసటగా నిలిచారు. ఇజ్రాయెల్ ఇటీవల జరిపిన దాడల్లో ఖమేనీ మరణించడంలో ఆయన కుటుంబం భవిష్యత్తు, ప్రతీకార చర్యలకు దిగే అవకాశాలపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇదే సమయంలో ఖమేనీ స్థానంలో ఎవరు వచ్చినా వాళ్లను లక్ష్యంగా చేసుకుంటామని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి కట్జ్ ఇటీవల కీలక వ్యాఖ్యలు చేశారు. ఆ దేశ ప్రభుత్వం నియమించిన ఏ నాయకుడినైనా నిస్సందేహంగా అంతం చేస్తామని హెచ్చరించారు. ఎక్కడ దాక్కున్నా వదిలిపెట్టేది లేదన్నారు. ఈ క్రమంలోనే ఖమేనీ రెండో కుమారుడు మజ్తబాను తమ సుప్రీం నేతగా ఇరాన్ అసెంబ్లీలోని కీలక నేతలు ఎన్నుకున్నట్టు ప్రచారం జరుగుతోంది.



నేటి సాక్షి
TGTEL/25/A1737 | NETI SAKSHI
కరీంనగర్ | ఆదివారం 08 మార్చి 2026

## నీవు లేని జీవితం ఎండిన మోడగా.........



మహిమ గల ఓ మహిళ
నీకంటుకోదు ఏ మైల
నిను చూసి మురుస్తుంది ఇలా
నివుంటే ప్రతీ ఇల్లు ఓ కోవెల
నీ పలుకే ఓ కోకిల
ఆ పలుకే లేకుంటే ప్రపంచమే వెలవెల
పసితణంలో అమ్మలా
పెరుగుతుంటే అక్క చెల్లిలా
ముసిమి ప్రయంలో స్నేహంల
యుక్తవయసులో భార్యలా
నను మరిపించే బిడ్డల.....
నా తోడు నిలిచావే ఇలా.....
ఓ మహిళా నీవు లేకుంటే జగమే ఎండిన ఓ మోడేగ ....
అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలతో

**రచన : ముత్యాల రాజేందర్ తెలుగు ఉపాధ్యాయుడు రాందాన్ తండా వర్ధన్నపేట**

## శంకర్పల్లి మున్సిపల్ లో విద్యుత్ తో పలు ఇళ్లల్లో టీవీలు ఫ్రిజ్లు నీలా మోటర్లు దగ్ధం



**నేటి సాక్షి శంకర్ పల్లి మార్చి 7 ( సుధాకర్ గౌడ్)** : శంకర్పల్లి మున్సిపల్ లో 15 వార్డులో శిశు మందిర్ స్కూల్ పక్కన ఉన్న ట్రాన్ఫర్ లో విద్యుత్ హెచ్చుతగ్గుదల కారణంగా పలు ఇళ్లల్లో టీవీలు ఫ్రిజ్లు లైట్ బుగ్గలు నీళ్ల మోటర్లు కాలిపోయినాయి ప్రజలు చాలా ఇబ్బంది పడ్డారు ఇండ్ల మధ్యలో ఉన్న ట్రాన్స్ఫరము తక్షణమే తీయాలని కాలనీవాసులుప్రజలు కోరు కుంటున్నారు

## ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

**కౌన్సిలర్లకు అంగన్వాడి టీచర్లు, ఆశ వర్కర్లు ,ఆర్ పి లకు ఘనంగా సన్మానం.....**



**నేటి సాక్షి నారాయణపేట మార్చి 7 ( రిపోర్టర్ ఇమామ్ సాబ్ ) :** నారాయణపేట జిల్లా కేంద్రం లో చేయూత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని ఈరోజు నారాయణపేట పట్టణంలోని మార్కండేయ మఠం (సుభాష్ రోడ్ ) చేయూత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళ దినోత్సవ వేడుకల్లో నారాయణపేటజిల్లా కౌన్సిలర్ అరుణ మనోహర్ గౌడ్, బండి రాజేశ్వరి, కౌన్సిలర్ డాక్టర్ గీతా విశ్వనాథ్ ,చేయూత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు పరిగి ఈశ్వరమ్మ ,సి ఎస్ ఎస్ జిల్లా అధ్యక్షురాలు సాయికుమారి ,కౌన్సిలర్ మహేష్ , కౌన్సిలర్ భరత్ , ఆర్ పి లను ఆశా వర్కర్లు ను ఘనంగా సన్మానించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా కేక్ కటింగ్ మరియు విందు నిర్వహించడం జరిగింది చేయూత స్వచ్ఛంద సంస్థ ప్రధాన కార్యదర్శి మాధవ్ ఉపాధ్యక్షులు ఎం ప్రవీణ్ కుమార్ చేయూత స్వచ్ఛంద సంస్థ సభ్యులు మొహమ్మద్ సోఫి . మాజీ కౌన్సిలర్ రమేష్ శివ వెంకటేష్ గౌడ్ బసవరాజ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉరివేసుకొని వివాహిత ఆత్మహత్య



**నేటి సాక్షి-మేడిపల్లి :** మేడిపల్లి మండలం దమ్మన్నపేట గ్రామానికి చెందిన కొక్కెర గంగామణి ఫ/శీ అంజయ్య, 29 ఎతీం, యాదవ కులానికి చెందిన మహిళకు 10 సం. ల క్రితం వివాహమైనది. వీరికి ఒక కొడుకు, ఇద్దరు బిడ్డలు సంతానం. కొడుకు వేదాన్ష్ కి ఆటిజం ( మంద బుద్ధి) ఉండడంతో గత ఐదు సంవత్సరాల నుంచి కొడుకు ఆరోగ్యం బాలేదని బాధపడుతూ, మానసిక ఆవేదన గురై జీవితం మీద విరక్తి చెంది ఈరోజు 07/03/2026 తెల్లవారుజామున 3 గం. ప్రాంతంలో ఆమె నివసిస్తున్న ఇంట్లోనే ఒక రూమ్ లో సీలింగ్ ఫ్యాన్ కు చీరతో ఉరివేసుకొని చనిపోయినది అని మృతురాలి తండ్రి కాసాడి నడిపి గంగారం తీ/శీ తక్కలపల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మేడిపల్లి ఎస్సై మాడ శ్రీధర్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## మృత్యుంజయ స్వామి శివాలయం గంగమ్మలను దర్శించుకున్న జిల్లా జడ్జి అరుణ సారిక



**నేటి సాక్షి న్యూస్ చౌడేపల్లి మార్చి 7 :** చిత్తూరు జిల్లా జడ్జి అరుణ సారిక చౌడేపల్లి మండలంలోని పలు దేవాలయాలను సందర్శించారు ,తొలుత స్థానిక శివాలయం అదేవిధంగా శక్తి క్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయాలను సందర్శించారు, శివాలయంలో అర్చకులు బోయకొండలో ఈవో ఉప కమిషనర్ ఏకాంబరములు న్యాయమూర్తిని సాదరంగా ఆహ్వానించి స్వామి అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు ,ఆయా ఆలయాలలో పవిత్ర తీర్థప్రసాదాలు అందించి సత్కరించారు,

## ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల జిల్లా,, మార్చి 7, నేటి సాక్షి :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన – ప్రగతి ప్రణాళికా కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లాలోని బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలోని 17, 31, 32, 33 వార్డులలో చేపట్టిన ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ సంపత్, చైర్ పర్సన్ దావ స్వాతి, వైస్ చైర్ పర్సన్ సత్యనారాయణ లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 6 నుంచి జూన్ 12వ తేదీ వరకు వరకు 99 రోజులకార్యచరణ రూపొందించడం జరిగిందని, క్షేత్రస్థాయి–ంలో సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపారు. గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో కార్యచరణ అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలలో పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి సారించడం, ప్రభుత్వ కార్యాలయాలలో పెండింగ్ లో ఉన్న ఫైళ్ల క్లియరెన్స్, ఆరోగ్యం, అరైవ్ అలైవ్, సంక్షేమం, పిల్లలు భద్రత, వ్యవసాయం, విద్య, యువత, మహిళలు, పర్యావరణం తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసి దశల వారీగా పూర్తిచేయాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలలో, కళాశాలలో విద్యార్థుల సంఖ్యపెంపొందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వేసవి దృష్ట్యా త్రాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, చిన్న సమస్యలు పరిష్కరించాలని తెలిపారు. 17వ వార్డులోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వార్డులు, మందుల నిల్వలు, పరిసరాలను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని తెలిపారు. అనంతరం రాంనగర్ ప్రాంతంలో కొనసాగుతున్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల నిర్మాణ పనులను పరిశీలించి పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## కార్యకర్తల కుటుంబాలకు పరామర్శ... ఆర్థిక సహాయం



- **కార్యకర్తల కుటుంబాలకు పరామర్శ... ఆర్థిక సహాయం అందించిన ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్**

**నేటి సాక్షి గజ్వేల్.** గజ్వేల్ మండలం రంగంపేట్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త మంగలి శ్రీనివాస్ ఇటీవల కిడ్నీ సంబంధిత వ్యాధితో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ శనివారం ఉదయం వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుని కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేసి సంతాపం వ్యక్తం చేశారు. అదేవిధంగా అదే గ్రామానికి చెందిన వడ్ల నర్సింహాచారి గుండెపోటుతో మృతి చెందగా వారి కుటుంబాన్ని కూడా పరామర్శించారు. ఇరు కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేస్తూ ధైర్యం చెప్పారు. పార్టీ కార్యకర్తల కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఈ సందర్భంగా తెలిపారు.

అనంతరం సింగాటం గ్రామానికి చెందిన వంజరి పోచయ్య ఇటీవల మృతి చెందగా వారి కుటుంబ సభ్యులు ప్రభాకర్, ప్రసాద్‌లను పరామర్శించారు. అలాగే చిన్న అరెపల్లి గ్రామానికి చెందిన నాంపల్లి మల్లయ్య గుండెపోటుతో మృతి చెందగా వారి కుటుంబాన్ని సైతం పరామర్శించి తన విచారం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ సీనియర్ నేతలు మధుసూదన్ రెడ్డి, రమేష్ గౌడ్, అహ్మద్, రంగంపేట్ సర్పంచ్ నాగరాజు, దుర్గారెడ్డి, కర్నాకర్ రెడ్డి, స్వామి, మనోహర్, సయ్యద్, మల్లేశం, నరేష్, ప్రహ్లాద్, షాదుల్ తదితరులు పాల్గొన్నారు

## మహిళల సేవలకు గుర్తింపు... పారిశుద్ధ్య కార్మికులకు సత్కారం

- **అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు ఘనంగా**
- **మహిళా ఉద్యోగులు, పారిశుద్ధ్య కార్మికులకు మున్సిపాలిటీ ఘన సన్మానం**



**నేటి సాక్షి గజ్వేల్ టీ :** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గజ్వేల్––ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగులు, పారిశుద్ధ్య కార్మికులకు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. మహిళల సేవలను గౌరవిస్తూ నిర్వహించిన ఈ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ చందన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మహిళా ఉద్యోగులు మరియు పారిశుద్ధ్య కార్మికులను శాలువాలు కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. సమాజ అభివృద్ధిలో మహిళలు పోషిస్తున్న పాత్రను కొనియాడుతూ నిర్వాహకులు వారికి అభినందనలు తెలిపారు. పట్టణ పరిశుభ్రత, ప్రజా సేవల్లో మహిళలు అంకితభావంతో పనిచేస్తూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ చందన మాట్లాడుతూ, మహిళలు నేటి సమాజంలో ప్రతి రంగంలోనూ తమ ప్రతిభను చాటుకుంటూ పురోగతికి దారి చూపుతున్నారని అన్నారు. ముఖ్యంగా పారిశుద్ధ్య కార్మికులు పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో ఎంతో కష్టపడుతూ విశేష సేవలు అందిస్తున్నారని కొనియాడారు. వారి కృషికి గుర్తింపుగా ఈ సన్మాన కార్యక్రమం నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. మున్సిపల్ కమిషనర్ వెంకట్ గోపాల్ మాట్లాడుతూ, మహిళలు కుటుంబ బాధ్యతలతో పాటు ఉద్యోగ బాధ్యతలను కూడా సమర్థంగా నిర్వహిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారని తెలిపారు. మహిళల సాధికారత కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది, మహిళా ఉద్యోగులు, పారిశుద్ధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు. మహిళల సేవలకు గౌరవం తెలుపుతూ నిర్వహించిన ఈ కార్యక్రమం అందరిలో మహిళల పట్ల గౌరవాన్ని మరింత పెంచేలా నిలిచింది. మహిళలు సమాజానికి ఆధారం –– వారి కృషి, త్యాగం, సేవలకు ఎల్లప్పుడూ గౌరవం ఇవ్వాలి అనే సందేశంతో కార్యక్రమం ముగిసింది.

## పరిసరాల పరిశుభ్రతే ఆరోగ్యానికి పునాది



- **స్వచ్ఛ భారత్ అభియాన్‌పై గౌతమ్ హై స్కూల్ ఎన్.సీసీ విద్యార్థులకు అవగాహన సదస్సు**

**నేటి సాక్షి –– కోరుట్ల ( రాధారపు నర్సయ్య ) :** స్వచ్ఛ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కోరుట్ల ఏరియా ఆసుపత్రి వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో గౌతమ్ హై స్కూల్ ఎన్.సీసీ విద్యార్థులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. పరిశుభ్రమైన పరిసరాలు ఆరోగ్యానికి ఎంతో ముఖ్యమని, స్వచ్ఛత ప్రతి ఒక్కరి బాధ్యత అని వైద్యులు విద్యార్థులకు వివరించారు. పాఠశాల స్థాయి నుంచే పరిశుభ్రతపై అవగాహన పెంపొందితే సమాజంలో మంచి మార్పు వస్తుందని పేర్కొన్నారు.

### పరిసరాల పరిశుభ్రతపై దృష్టి

ఈ సందర్భంగా ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సునీత రాణి మాట్లాడుతూ..పరిశుభ్రమైన పరిసరాలు మంచి ఆరోగ్యానికి పునాది అని తెలిపారు. ప్రతి ఒక్కరు తమ ఇల్లు, పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ఎంతో అవసరమని సూచించారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చెత్త డబ్బాల్లోనే వేయాలని, ఇలా చేయడం ద్వారా అనేక రకాల వ్యాధులను నివారించవచ్చని వివరించారు.

### ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలని సూచన

ప్లాస్టిక్ వినియోగం అధికంగా ఉండటం వల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం కలుగుతుందని డాక్టర్ సునీత రాణి తెలిపారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం ద్వారా ప్రకృతిని, పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని పేర్కొన్నారు. విద్యార్థులు తమ కుటుంబ సభ్యులకు కూడా ఈ విషయంపై అవగాహన కల్పించాలని సూచించారు.

### వ్యక్తిగత పరిశుభ్రతపై మార్గదర్శనం

ఈ సందర్భంగా వైద్య సిబ్బంది విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై కూడా అవగాహన కల్పించారు. తరచుగా చేతులు కడుక్కోవడం, పరిశుభ్రమైన నీటిని తాగడం, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం వంటి అలవాట్లను పాటించడం ద్వారా అనేక వ్యాధులను నివారించవచ్చని తెలిపారు. ఆరోగ్యకరమైన జీవన విధానం కోసం పరిశుభ్రతను ప్రతి ఒక్కరు అలవాటు చేసుకోవాలని సూచించారు.

### స్వచ్ఛత ప్రతిజ్ఞ –– ఆసుపత్రి ప్రాంగణంలో శుభ్రత కార్యక్రమం

కార్యక్రమం ముగింపులో విద్యార్థులతో కలిసి ‘స్వచ్ఛ తెలంగాణ –– స్వచ్ఛ భారత్’ అనే ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం గౌతమ్ హై స్కూల్ ఎన్.సీసీ విద్యార్థులు ఆసుపత్రి ప్రాంగణానికి వెళ్లి అక్కడ ఉన్న చెత్తను శుభ్రపరిచి పరిశుభ్రతపై తమ బాధ్యతను చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి ఆర్ఎంఓ డా. వినోద్, ఇన్ఫెక్షన్ కంట్రోల్ ఆఫీసర్ డా. రమేష్, శానిటేషన్ సూపర్వైజర్ మర్రి సంతోష్, ఐసీఎన్ సురేందర్, జ్యోతిర్మయి, గౌతమ్ హై స్కూల్ ప్రిన్సిపాల్ గోపి, కిజార్, క్రిస్టినా, విజయ నాయక్, విద్యార్థులు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి -విరూపాక ప్రణవి రెడ్డి



**నేటి సాక్షి గజ్వేల్** సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకమని, నేటి కాలంలో మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో ముందుకు రావాలని మహిళా నాయకురాలు విరూపాక ప్రణవి రెడ్డి అన్నారు. చిన్న గ్రామంలో జన్మించి సాధారణ కుటుంబంలో పెరిగిన ఆమె, కష్టపడే స్వభావం మరియు సేవా భావంతో సమాజంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు పొందారు. తన వృత్తి జీవితాన్ని ఉపాధ్యాయురాలిగా ప్రారంభించిన ప్రణవి రెడ్డి, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఎంతో నిబద్ధతతో సేవలందించారు. విద్య అనేది సమాజ మార్పుకు మూలాధారం అనే నమ్మకంతో విద్యార్థుల్లో మంచి విలువలు పెంపొందించేందుకు కృషి చేశారు. తరువాత తన భర్త విరూపాక శ్రీనివాస్ రెడ్డి ఆశయాలకు తోడుగా రాజకీయాల్లోకి అడుగుపెట్టి ప్రజాసేవను తన జీవిత లక్ష్యంగా మార్చుకున్నారు. ఎర్రవల్లి ఎంపిటీసీగా ఐదేళ్ల పాటు సేవలందిస్తూ గ్రామాభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలు చేపట్టారు. గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, మహిళల సంక్షేమం వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ చూపారు. అదేవిధంగా మహిళా కాంగ్రెస్ సిద్ధిపేట జిల్లా ఉపాధ్యక్షురాలిగా బాధ్యతలు నిర్వహిస్తూ మహిళల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం, వారి హక్కుల కోసం పోరాడడం వంటి కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటున్నారు. మహిళలు ఆర్థికంగా, సామాజికంగా బలపడితేనే కుటుంబం మరియు సమాజం అభివృద్ధి చెందుతుందని ఆమె అభిప్రాయపడ్డారు. కరోనా మహమ్మారి సమయంలో గ్రామ ప్రజలకు అండగా నిలిచి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అవసరమైన వారికి కూరగాయలు పంపిణీ చేయడం, మాస్కులు అందించడం, గ్రామంలో శానిటైజేషన్ కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ప్రజల్లో ధైర్యం నింపారు. ఈ సేవా కార్యక్రమాలు గ్రామ ప్రజల ప్రశంసలను పొందాయి. అలాగే రెడ్డి సమాజ ఐకమత్యం కోసం, రెడ్డి సంఘ శ్రేయస్సు కోసం కూడా ఆమె నిరంతరం కృషి చేస్తున్నారు. సమాజంలో ఐక్యత పెంపొందించేందుకు, యువతను సేవా కార్యక్రమాల వైపు దారితీసేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. సమాజ సేవ పట్ల ఆమె చూపుతున్న అంకితభావాన్ని గుర్తించి ఇటీవల ఆమెను "ఆదర్శనంది" అవార్డుతో సత్కరించారు. ఈ సందర్భంగా ప్రణవి రెడ్డి మాట్లాడుతూ, మహిళలు ధైర్యంగా ముందుకు వచ్చి సమాజ సేవలో పాల్గొంటే సమాజం మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు. భవిష్యత్తులో కూడా ప్రజలకు మరింత సేవ చేయాలని సంకల్పంతో ముందుకు సాగుతానని, ముఖ్యంగా మహిళల అభివృద్ధి మరియు యువత ప్రగతికి కృషి చేస్తానని ఆమె తెలిపారు.

# అందుబాటులో ఉండి ప్రజలు సమస్యలు పరిష్కరించాలి



**నేటి సాక్షి న్యూస్ చౌడేపల్లి మార్చి 7 :** గ్రామీణ ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలపై పరిష్కరించాలని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గువ్వల రమేష్ రెడ్డి అన్నారు. శనివారం స్థానిక మండల పరిపాలన భవనంలో ఎంపీడీవో తహసిల్దార్ కార్యాలయాల నందు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవికాలం కావడంతో గ్రామీణ ప్రాంతాలందు ముఖ్యంగా తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు, అంతేకాకుండా పారిశు ధ్యం పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు ప్రతి అధికారి సమస్యల గురించి ఎప్పటికప్పుడు తెలుసుకొని ఉ న్నతాధికారులకు నివేదిక ఇవ్వాలని ,ఆ స్థాయిలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు ,ఉపాధి హామీ పనులపై మండల స్థాయిలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు .కూలీలు వలసలు వెళ్లకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు ,అనంతరం పంచాయతీల వారీగా సమీక్షించారు ఈ కార్యక్రమంలో తహసిల్దార్ పార్వతి ,ఎంపీడీవో లీలా మాధవి, తెలుగుదేశం పార్టీ నాయకులు ఆవుల రామచంద్రయ్య ,పూల చంద్రమౌళి ,ముని వెంకటప్ప ,మనీ కళ్యాణ్ ,విజయభాస్కర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు,

# టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది గైర్హాజరు

- వైద్యం కోసం వచ్చిన ప్రజలు నిరాశతో వెనుదిరుగు -- చర్యలు తీసుకోవాలని గ్రామస్తుల డిమాండ్






**నేటి సాక్షి.శంకర్పల్లి మార్చి 07 :** రంగారెడ్డి జిల్లా శంకర్పల్లి మండలంలోని టంగుటూరు గ్రామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం 10 గంటలు దాటినా ఆసుపత్రిలో వైద్య సిబ్బంది కనిపించకపోవడంతో చికిత్స కోసం వచ్చిన వారు గంటల తరబడి ఎదురు చూసి నిరాశతో వెనుదిరుగుతున్న పరిస్థితి నెలకొంది. స్థానికుల సమాచారం ప్రకారం ఆసుపత్రికి వచ్చినప్పుడు సిబ్బంది ఎవరూ లేకపోవడం తరచుగా జరుగుతోందని తెలిపారు. ఇటీవల ఒక వ్యక్తి కుక్క కాటు చికిత్స కోసం మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఆసుపత్రికి వచ్చినప్పటికీ అక్కడ ఎవరూ లేకపోవడంతో తిరిగి వెళ్లాల్సి వచ్చిందని పేర్కొన్నారు. ప్రభుత్వం గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది లేకపోవడం పట్ల గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ఆసుపత్రిలో సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

# మెట్‌పల్లి మున్సిపల్ కార్యాలయంలో ముందస్తు మహిళా దినోత్సవ వేడుకలు



- మహిళా ఉద్యోగులు, పారిశుధ్య కార్మికులకు ఘన సన్మానం

**నేటి సాక్షి -- మెట్‌పల్లి ( రాధారపు నర్సయ్య ) :** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మెట్‌పల్లి మున్సిపల్ కార్యాలయంలో ముందస్తుగా మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యాలయంలో సేవలందిస్తున్న మహిళా ఉద్యోగులు, మహిళా పారిశుధ్య కార్మికులను గౌరవిస్తూ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం ఆనందోత్సాహాలతో కళకళలాడింది.

## మహిళలకు సన్మానం

ఈ కార్యక్రమంలో పుర చైర్మన్ మైలారపు లింబాద్రి, వైస్ చైర్మన్ నవీన్ పాల్గొని కార్యాలయంలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులు, మహిళా పారిశుధ్య కార్మికులను శాలువాలతో సత్కరించారు. మహిళలు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ సమాజ అభివృద్ధికి తోడ్పడుతున్నారని నాయకులు ప్రశంసించారు. అనంతరం వారికి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

## సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మహిళలు సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. కుటుంబ నిర్వహణతో పాటు ఉద్యోగ బాధ్యతలను కూడా సమర్థంగా నిర్వహిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారని తెలిపారు. మహిళల కృషి వల్లే కుటుంబం బలోపేతం అవడంతో పాటు సమాజం కూడా ముందుకు సాగుతుందని అన్నారు.

## మహిళల సేవలకు గుర్తింపు

మున్సిపల్ కార్యాలయంలో మహిళా ఉద్యోగులు, పారిశు ధ్య కార్మికులు అందిస్తున్న సేవలు ఎంతో గొప్పవని నాయకులు పేర్కొన్నారు. పట్టణ పరిశుభ్రత, కార్యాలయ నిర్వహణలో మహిళల పాత్ర ఎంతో ముఖ్యమని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు మహిళల సేవలకు గుర్తింపు ఇవ్వడంతో పాటు వారిలో మరింత ఉత్సాహాన్ని కలిగిస్తాయని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్యాలయ సిబ్బంది, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమం సిబ్బందిలో ఉత్సాహాన్ని నింపింది.

# అర్టిజన్ కార్మికుల మహాధర్నా

**రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ సంస్థలో పనిచెస్తున్నా దాదాపు 20 వెలమంది అర్టిజన్ కార్మికులకు ఎ.పి.ఎస్.ఇ.బి.రుల్స అమలు చెయాలి**



**నేటి సాక్షి, నారాయణపేట, మార్చి 7,( రిపోర్టర్ ఇమామ్ సాబ్ ):** రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ సంస్థలొ పనిచెస్తున్నా దాదాపు 20 వెలమంది అర్టిజన్ కార్మికులకు ఎ.పి.ఎస్.ఇ.బి.రుల్స అమలు చెయాలి మరియు పిస్ రెట్ కార్మికులు అయిన ఎస్ పి ఎమ్.స్పాట్ బిల్డర్ మొదలైన వర్కర్స్ కార్మికుల సమస్యలు పరిష్కారించాలని టి వి ఎ ఈ జెఎసి రాష్ట్ర కమిటీ పిలుపు మెరకు ఈ నెల 10వ తెది నా విద్యుత్ సి ఎమ్ డి ఆఫిస్ మింట్ కాంపౌండ్ హైదరాబాద్ దగ్గర జరిగె మహాధర్నా కు ఉమ్మడి మహబుబ్ నగర్ జిల్లా లొని అన్ని డివిజన్ల అర్టిజన్ కార్మికులు.పిస్ రెట్ కార్మికులు. అధిక సంఖ్యలొ మహాధర్నా కు ఉప్పెనలా కదిలి రావాలని .మరియు సంతకాలు సెకరణ ఇంకా పుర్తిచెయని వారు త్వరగా చెయగలరని . టి వి ఎ ఈ జెఎసి ఉమ్మడి మహబుబ్ నగర్ జిల్లా .కన్వినర్ దిల్ దార్ .సురెష్ .భాస్కర్ రెడ్డి తెలుపారు. ఇట్టి సమావెశానికి నారాయణ పెట్ డివిజన్ నాయకులు .నర్సిములు.లక్ష్మికాంతు.జెపాల్ .బి,శ్రీధర్.రమెష్.వెంకట్రాములు.రాములు .మహెశ్వర్ రెడ్డి.తదితర నాయ కులు పాల్గొన్నారు.

# విజయాన్ని గ్రామానికి అంకితమిస్తాం- కెప్టెన్ బషీర్



**నేటి సాక్షి అనంతగిరి :** విజయాన్ని తమ గ్రామానికి అంకితమిస్తున్నామని రంగయ్య గూడెం కబడ్డీ క్రీడాకారులు అన్నారు. అనంతగిరి మండలం పోలవరం గ్రామంలో అంకుమాంబ జాతర సందర్భంగా గణేష్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామస్థాయి కబడ్డీ క్రీడలో భాగంగా ఆవాస గ్రామమైన రంగయ్య గూడెం క్రీడాకారులు పాల్గొన్నారు. ఎంతో ఉత్కంఠ భరితంగా సాగిన క్రీడలో వరుస విజయాలతో వారి ప్రతిభను కరపరిచారు. తుది దశలో సమయం అనుకూలంగా లేకపోవడంతో చిట్టీల రూపంలో డ్రాలు తీయగా ద్వితీయ స్థానాన్ని రంగయ్య గూడెం దక్కించుకుంది. ఈ విజయాన్ని తమ గ్రామ ప్రజలకు అంకితమిస్తున్నామని గ్రామంలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు మరింత కృషి చేస్తామని ఆ జట్టు కెప్టెన్ షేక్ బషీద్ అన్నారు. ఎంతో చాకచక్యంగా వరుస విజయాలతో పోతున్న జట్టుకు ప్రజాదరణ మెండుగా ఉండడం విశేషం. అనంతరం గణేష్ యూత్ ఆధ్వర్యంలో బహుమతులను అందుకున్నారు.

# విద్యార్థులలో ఆత్మవిశ్వాసం పెరగాలి

**అనంతగిరి ఎస్ఐ నవీన్ కుమార్**



**నేటి సాక్షి అనంతగిరి :** మండల కేంద్రాల్లోని జిల్లా పరిషత్తు పాఠశాలలో పదో తరగతి పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు ఎస్సై నవీన్ కుమార్ పరీక్షలకు ఉపయోగపడే ప్యాడ్లలను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై నవీన్ కుమార్ మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులు కష్టపడి చదివి అత్యున్నత మార్కులు సాదించుకొని పాఠశాలకు,తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకరవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సలీమా,ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ




**నేటిసాక్షి, గన్నేరువరం,(బుర్ర అంజయ్య గౌడ్) :** గన్నేరువరం మండలం ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమంలో భాగంగా శనివారం రోజున మాదాపూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో పరిశుభ్రత కార్యక్రమం సర్పంచ్ మాధురి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాదరి శ్రీనివాస్, ఉప సర్పంచ్ కళ్లెం అనిత స్కూల్ హెచ్‌ఎం సత్యనారాయణ గ్రామ పంచాయతీ కార్యదర్శి, పాలకవర్గ సభ్యులు, నవుండ్ల రామచంద్రం భూ పెల్లి రమేష్ మాడుగుల కరుణాకర్ రెడ్డి . మరియు నాయకులు గొడుగు స్వామి యాదవ్ కళ్లెం మల్లారెడ్డి, మహిళా సంఘ సభ్యులు, పాఠశాల సిబ్బంది మరియు గ్రామ ప్రజలు పాల్గొని పాఠశాల పరిసరాలను శు భ్రపరిచారు. గ్రామ పరిశుభ్రత, అభివృద్ధి మరియు ప్రజల భాగస్వామ్యంతో గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దే దిశగా ఈ కార్యక్రమాలు కొనసాగుతాయి. అని సర్పంచ్ మాదరి శ్రీనివాస్ తెలిపారు.

# బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం చేసిన క్యాతం రాజేశ్వర్ రెడ్డి



**నేటి సాక్షి-మేడిపల్లి :** మేడిపల్లి మండల కేంద్రం లో అమ్ముల రజిత అనే మహిళ (కమ్మరి )కాన్సర్ తో బాధపడుతూ దీన స్థితిలో ఉన్నందున రజిత ని పరామర్శించి బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పి 5000 వేల రూపాయలు ఆర్థిక సహాయం చేసిన క్యాతం రాజేశ్వర్ రెడ్డి. బాధితురాలికి సహాయం చేయడానికి దాతలు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బొంతల శివ, అంకం శ్రీనివాస్,పుల్లల వేణు,తదితరులు పాల్గొన్నారు.




# టీమిండియా అభిమానులకు గుడ్ న్యూస్

## అభిమానుల కోసం ప్రత్యేక రైలు..!

**అహ్మదాబాద్:** టీ20 వరల్డ్ కప్ 2026 ఫైనల్ లో భారత్, న్యూజిలాండ్ జట్లు ఆదివారం (మార్చి 8)న అహ్మదాబాద్‌లో తలపడనున్నాయి. ఈ హై వోల్టేజ్ మ్యాచ్‌ను ప్రత్యక్షంగా చూడాలనుకునే అభిమానుల కోసం నార్తర్న్ రైల్వే ప్రత్యేక రైలును ప్రకటించింది. ఫైనల్ మ్యాచ్ టికెట్లు ఆలస్యంగా విడుదల కావడంతో చాలామంది క్రికెట్ అభిమానులు ముందుగానే ప్రయాణ ఏర్పాట్లు చేసుకోలేకపోయారు. మరోవైపు విమాన టికెట్ల ధరలు భారీగా పెరగడంతో అభిమానులు ఇబ్బందులు పడుతున్నారు. దీనితో నార్తర్న్ రైల్వే ఢిల్లీ నుంచి సబర్మతి వరకు ప్రత్యేక రైలును నడిపేందుకు సిద్ధమైంది. ఈ ప్రత్యేక రైలు నేడు (మార్చి 7)రాత్రి 11:45 గంటలకు ఢిల్లీ రైల్వే స్టేషన్ నుంచి బయలుదేరుతుంది. ఆ రైలు మార్చి 8 మధ్యాహ్నం 2:30 గంటలకు సబర్మతి రైల్వే స్టేషన్ కు చేరుకుంటుంది. ఈ రైలు ఢిల్లీ కంటోన్మెంట్ రైల్వే స్టేషన్, గురుగ్రామ్, జైపూర్ మార్గంగా ప్రయాణిస్తుంది. 04062 ట్రైన్ నంబర్ కలిగిన ఈ రైలులో మొత్తం 19 కోచ్‌లు ఉండగా.. వాటిలో థర్డ్ ఏసీ, సెకండ్ ఏసీ కోచ్‌లు కూడా ఉంటాయి. భారత జట్టు శుక్రవారం నాడే అహ్మదాబాద్ కు చేరుకుంది. ఈ రోజు సాయంత్రం 6 గంటల నుంచి 9 గంటల వరకు ప్రాక్టీస్ సెషన్ నిర్వహించనుంది. మరోవైపు న్యూజిలాండ్ జట్టు మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు ప్రాక్టీస్ చేయనుంది. న్యూజిలాండ్ జట్టు ప్రీ-మ్యాచ్ ప్రెస్ కాన్ఫరెన్స్ మధ్యాహ్నం 1:30 గంటలకు జరగనుంది. భారత్ మీడియా సమావేశం మాత్రం ప్రాక్టీస్‌కు 15 నిమిషాల ముందు ప్రారంభమవుతుంది. ఇది ఇలా ఉండగా.. టీ20 వరల్డ్ కప్ చరిత్రలో భారత్ ఇప్పటివరకు న్యూజిలాండ్‌ను ఒక్కసారి కూడా ఓడించలేదు. దీనితోపాటు సూర్యకుమార్ యాదవ్ నేతృత్వంలోని భారత జట్టుకు ఈసారి చరిత్రను తిరగరాస్తోందని నమ్మకం వ్యక్తం చేస్తుంది. అంతేకాకుండా భారత్ వరుసగా రెండు టీ20 వరల్డ్ కప్ టైటిళ్లు గెలిచిన తొలి జట్టుగా నిలవడం, సొంత గడ్డపై టీ20 వరల్డ్ కప్ గెలిచిన తొలి జట్టుగా నిలవడం లక్ష్యంగా బరిలోకి దిగనుంది.

# అభిషేక్ విషయంలో కోచ్, కెప్టెన్ సంచలన నిర్ణయం

## టీమిండియా తుది జట్టు ఫిక్స్!

నేడు (మార్చి 8) టీ20 వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్. న్యూజిలాండ్‌తో పోరుకు భారత్ సిద్ధమైంది. గుజరాత్‌లోని అహ్మదాబాద్ స్టేడియంలో ఈ మ్యాచ్ జరగనుంది. అయితే.. ఈ మ్యాచ్‌లో ఓపెనర్ అభిషేక్ శర్మపై అందరి దృష్టి ఉంది. ఈ మ్యాచ్‌లో అభిషేక్‌ను ఉంచుతారా? లేదా? తొలగిస్తారా? అనే అంశంపై జోరుగా చర్చ జరుగుతోంది. అయితే.. టోర్నమెంట్ మొత్తం అభి ప్రదర్శన నిరాశ కలిగించినప్పటికీ జట్టు నిర్వహణ మాత్రం అతనిపై నమ్మకం కోల్పోలేదని తెలుస్తోంది. ఇప్పుడు ఉన్న పరిస్థితుల్లో జట్టులో ఎలాంటి మార్పులు చేసేందుకు కోచ్, కెప్టెన్, మేనేజ్‌మెంట్ ఇష్టపడటం లేదని సమాచారం. వాస్తవానికి.. టోర్నమెంట్ ప్రారంభమైనప్పుడు పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉండేది. మొదట్లో అభిషేక్ శర్మ భారత ఓపెనింగ్ బ్యాటింగ్‌కు ప్రధాన బలం అవుతాడని అందరూ భావించారు. మరోవైపు సంజూ స్థానంపై అనేక సందేహాలు వ్యక్తమయ్యాయి. ఈ టోర్నమెంట్ సంజూపై ఆశలు తక్కువగానే ఉన్నాయి. అయితే వెస్టిండీస్‌తో జరిగిన కీలక మ్యాచ్ తర్వాత పరిస్థితి పూర్తిగా మారిపోయింది. సంజూ శాంసన్ స్థిరంగా ఆడుతూ విమర్శకుల నోర్లు మూయించగా, మరోవైపు అభిషేక్ శర్మ ఫామ్‌పై ప్రశ్నలు మరింత పెరిగాయి. ప్రారంభంలో శామ్సన్ గురించి చర్చలు జరిగితే, ఇప్పుడు మాత్రం టోర్నమెంట్ చివరి దశకు వచ్చేసరికి అభిషేక్ శర్మ నిరాశాజనక ప్రదర్శనే ప్రధాన చర్చగా మారింది. విధ్వంసకర బ్యాట్స్‌మెన్‌గా పేరొందిన అభిషేక్ ఈ టోర్నమెంట్‌లో రాణించలేకపోయాడు. గత ఆరు మ్యాచ్‌ల్లో అభి చేసిన పరుగులు చూస్తే పరిస్థితి స్పష్టంగా తెలుస్తుంది. వరుసగా 0, 0, 0, 15, 10, 9 పరుగులు మాత్రమే చేశాడు. జింబాబ్వేపై చేసిన అర్ధశతకం తప్ప ఈ టోర్నమెంట్‌లో చెప్పుకోదగ్గ ఇన్నింగ్స్ ఏదీ లేదు. అయినా తుది పోరు సమీపిస్తున్న సమయంలో ఓపెనింగ్ జంటను మార్చే ఆలోచన జట్టు నిర్వహణలో లేదని సమాచారం. ఇంగ్లాండ్‌తో జరిగిన మ్యాచ్ తర్వాత కోచ్ గౌతమ్ గంభీర్, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఇద్దరూ అభిషేక్ శర్మపై పూర్తి నమ్మకం ఉందని చెప్పారు. అశ్విన్ లాంటి కొంత మంది మాజీ ప్లేయర్స్ సైతం అభిషేక్‌కు మద్దతు ప్రకటిస్తున్నారు. ఈ మ్యాచ్‌లో అవకాశం కల్పించాలని.. అభిషేక్‌ను ఒత్తిడికి దూరంగా పెడితేనే మంచి ఫలితం వస్తుందని చెబుతున్నారు. అంతేకాదు.. అభిషేక్ న్యూజిలాండ్ బౌలర్లను గతంలో సమర్థవంతంగా ఎదుర్కొన్నాడు. ఇప్పుడు కూడా అదే ఫామ్ కొనసాగిస్తాడనే నమ్మకం ఉంది.


**భారత్ (ప్లేయింగ్ XI) అంచనా:** అభిషేక్ శర్మ, సంజూ శాంసన్(w), ఇషాన్ కిషన్, సూర్యకుమార్ యాదవ్(c), తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే, అక్షర్ పటేల్, అర్ష్‌దీప్ సింగ్, వరుణ్ చకరవర్తి, జస్ప్రీత్ బుమ్రా.




# ఫైనల్‌కు ముందే సంబరాలు

- ఆకట్టుకోనున్న స్టార్ల ప్రదర్శనలు

**అహ్మదాబాద్:** 2026 ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచ కప్ ఉత్కంఠభరితమైన చివరి దశకు చేరుకుంది. ఈ మెగా టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ ఆదివారం (మార్చి 8) అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో జరుగనుంది. ఫైనల్‌లో భారత్ మరియు న్యూజిలాండ్ జట్లు తలపడనున్నాయి. ఈ హై వోల్టేజ్ మ్యాచ్ భారత కాలమానం ప్రకారం సాయంత్రం 7 గంటలకు ప్రారంభమవుతుంది. టాస్ సాయంత్రం 6:30 గంటలకు జరుగుతుంది. అయితే, ఫైనల్ మ్యాచ్‌కు ముందు అభిమానులను అలరించేందుకు నిర్వాహకులు గ్రాండ్ ముగింపు వేడుకను ఏర్పాటు చేశారు. ఈ వేడుక సాయంత్రం 5:30 గంటలకు ప్రారంభమవుతుంది. క్రికెట్ అభిమానులకు ఇది ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. ఈ వేడుకలో ప్రముఖ అంతర్జాతీయ పాప్ స్టార్ రాకీ మార్టిన్‌ప్రత్యేక ప్రదర్శన ఇవ్వనున్నారు. అలాగే బాలీవుడ్ మరియు పంజాబీ గాయకుడు సుఖ్‌బీర్ తన హిట్ పాటలతో ప్రేక్షకులను అలరించనున్నారు. గుజరాతీ జానపద సంగీతానికి ప్రతీకగా నిలిచిన ఫాల్గుని ఫాటక్‌కూడా తన ప్రత్యేక ప్రదర్శనతో వేదికను సందడిగా మార్చనున్నారు. సంగీతం మరియు క్రికెట్ కలయికతో అభిమానులకు గుర్తుండిపోయే అనుభవాన్ని అందించేందుకు ఈ కార్యక్రమం సిద్ధమైంది. ఇక క్రికెట్ విషయానికి వస్తే, భారత జట్టు అద్భుత ప్రదర్శనతో ఫైనల్‌కు చేరుకుంది. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ నాయకత్వంలో భారత జట్టు సెమీఫైనల్లో ఇంగ్లాండ్ జట్టును ఏడు పరుగుల తేడాతో ఓడించింది. ఈ మ్యాచ్ ముంబైలోని వాంఖడే స్టేడియంలో జరిగింది. చివరి ఓవర్ వరకు సాగిన ఈ మ్యాచ్ అభిమానులను ఉత్కంఠకు గురి చేసింది. ఇదే సమయంలో న్యూజిలాండ్ జట్టు కూడా అద్భుత ప్రదర్శనతో ఫైనల్‌కు చేరుకుంది. సౌతాఫ్రికాపై తొమ్మిది వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్ కోల్‌కతాలోని ఈడెన్ గార్డన్స్‌లో జరిగిన విషయం విదితమే.. టీ20 ప్రపంచ కప్ చరిత్రలో భారత జట్టు నాలుగోసారి ఫైనల్‌లోకి ప్రవేశించింది. ఈ మ్యాచ్ గెలిస్తే, భారత్ మూడోసారి టీ20 ప్రపంచ కప్ టైటిల్ గెలిచిన తొలి జట్టుగా కొత్త రికార్డు సృష్టించే అవకాశం ఉంది. మరోవైపు న్యూజిలాండ్ జట్టు రెండోసారి ఫైనల్‌కు చేరుకుంది. కివీస్ ఇప్పటివరకు టీ20 ప్రపంచ కప్ టైటిల్ గెలవలేదు. ఈసారి తమ తొలి ట్రోఫీని గెలుచుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. స్వదేశంలో మ్యాచ్ జరుగుతుండటం భారత జట్టుకు కొంత ప్రయోజనంగా భావిస్తున్నారు. అయితే ఐసీసీ టోర్నీల్లో న్యూజిలాండ్ తరచుగా భారత్‌కు గట్టి పోటీ ఇచ్చిన విషయం కూడా గమనించాల్సిందే. టీ20 ప్రపంచ కప్ చరిత్రలో న్యూజిలాండ్‌తో జరిగిన మూడు మ్యాచ్‌లలో భారత్ ఓడిపోయిన రికార్డు ఉంది. కాబట్టి ఈసారి జరిగే ఫైనల్ మ్యాచ్ మరింత ఉత్కంఠభరితంగా ఉండబోతుందని క్రికెట్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.




# బిగ్ షాక్

## క్రికెట్ అభిమానులకు బ్యాడ్ న్యూస్

- నేడు రిటైర్‌మెంట్ ప్రకటించనున్న సూర్యకుమార్ యాదవ్!?
- స్కై రిటైర్‌మెంట్ ప్రకటించనున్నట్లు ప్రచారం




**అహ్మదాబాద్:** భారత క్రికెట్ అభిమానులకు ఒకవైపు టీ20 ప్రపంచకప్ ఫైనల్ ఉత్సాహం ఉంటే.. మరోవైపు ఒక చేదు వార్త సోషల్ మీడియాలో హల్చల్ చేస్తోంది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో నేడు (మార్చి 8)న న్యూజిలాండ్‌తో జరగనున్న ఈ చారిత్రాత్మక పోరు తర్వాత.. టీమ్ ఇండియా 'మిస్టర్ 360' ప్లేయర్ సూర్యకుమార్ యాదవ్ అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్ బై చెప్పబోతున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. ప్రస్తుతం భారత టీ20 జట్టుకు సారథిగా వ్యవహరిస్తున్న సూర్యకుమార్, ఈ మెగా టోర్నీ ఫలితంతో సంబంధం లేకుండా తన కెరీర్‌కు ముగింపు పలకాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. గెలిచినా, ఓడినా ఇదే తన చివరి అంతర్జాతీయ మ్యాచ్ అని ఆయన భావిస్తున్నట్లు నెట్టింట వార్తలు వైరల్ అవుతున్నాయి.

ముఖ్యంగా యువ ఆటగాళ్లకు అవకాశం ఇవ్వాలనే ఉద్దేశంతోనే స్కై ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. సూర్యకుమార్ యాదవ్ అంటేనే విధ్వంసకర బ్యాటింగ్ గుర్తొస్తుంది. అయితే.. ఈ ప్రపంచకప్‌లో ఆయన గణాంకాలు చూస్తుంటే ఆ పదును కాస్త తగ్గినట్లు కనిపిస్తోంది. ఈ టోర్నీలో ఇప్పటివరకు 8 ఇన్నింగ్స్‌ల్లో 242 పరుగులు చేసినా.. ఆయన స్ట్రైక్ రేట్ 137.50 వద్దే ఆగిపోయింది. గతంలో 150కి పైగా స్ట్రైక్ రేట్‌తో విరుచుకుపడే సూర్య, ఇప్పుడు కాస్త నెమ్మదించడం అభిమానులను ఆందోళనకు గురిచేస్తోంది. మరోవైపు ఇషాన్ కిషన్, సంజు శాంసన్ వంటి కుర్రాళ్లు 180కి పైగా స్ట్రైక్ రేట్‌తో దూసుకుపోతుండటం కూడా స్కై ఆలోచనలో మార్పు తెచ్చి ఉండవచ్చని టాక్.

35 ఏళ్ల వయసులో ఉన్న సూర్యకుమార్.. ప్రస్తుతం కేవలం టీ20 ఫార్మాట్‌కే పరిమితమయ్యారు. టెస్టుల్లో ఒక్క మ్యాచ్, వన్డేల్లో ఆశించిన స్థాయిలో రాణించలేకపోవడం (37 మ్యాచ్‌ల్లో 773 పరుగులు) ఆయన కెరీర్‌పై ప్రభావం చూపాయి. టీ20ల్లో 112 మ్యాచ్‌ల్లో 3272 పరుగులు సాధించి లెజెండరీ హోదా పొందినప్పటికీ.. భవిష్యత్తు టీమ్ బిల్డింగ్ దృష్ట్యా స్వచ్ఛందంగా తప్పుకోవడమే మేలని ఆయన భావిస్తున్నట్లు తెలుస్తోంది. దీనిపై అధికారిక ప్రకటన అనేది రాలేదు. ఒకవేళ ఇదే నిజమైతే.. రేపు జరగబోయే ఫైనల్ మ్యాచ్ సూర్యకుమార్ యాదవ్ కెరీర్‌లో ఒక ఎమోషనల్ ఎండింగ్ కానుంది. మరి ఈ స్టార్ ప్లేయర్ కప్పుతో తన ప్రయాణాన్ని ముగిస్తారో లేదో చూడాలి.

# గంభీర్ కాస్త జాగ్రత్త!

అహ్మదాబాద్: క్రికెట్ ప్రపంచం మరో మహా సంగ్రామానికి రంగం సిద్ధమైంది. 2026 ఐసీసీ టీ20 ప్రపంచ కప్ టైటిల్ వేటలో భారత జట్టు ఆఖరి మెట్టుపై నిలిచింది. హోమ్ గ్రౌండ్ అహ్మదాబాద్‌లో న్యూజిలాండ్‌తో తలపడనున్న టీమిండియాకు ఈ మ్యాచ్ అంత సులువు కాదనిపిస్తోంది. ముఖ్యంగా సెమీఫైనల్లో దక్షిణాఫ్రికాను చిత్తు చేసిన కివీస్ ఫామ్ చూస్తుంటే కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, కోచ్ గౌతమ్ గంభీర్‌లు సరికొత్త వ్యూహాలు రచించాల్సిన అవసరం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ మ్యాచ్‌లో కివీస్ జట్టు నుంచి టీమిండియాను ముంచే ముల్లు ఎవరో ఈ స్టోరీలో తెలుసుకుందాం.

విధ్వంసక బ్యాటర్లు ఒకెత్తయితే.. ఆ స్పిన్నర్ మరొకెత్తు!

న్యూజిలాండ్ జట్టులో ఫిన్ అలెన్, టిమ్ సీఫెర్ట్ వంటి విధ్వంసక బ్యాటర్లు ఉన్నప్పటికీ, భారత బౌలర్లు వారిని కట్టడి చేయగలరనే నమ్మకం ఉంది. కానీ, టీమిండియా బ్యాటర్లకు అసలైన సవాలు విసిరేది మాత్రం కివీస్ స్పిన్ అస్త్రం, భారత సంతతి ఆటగాడు రచిన్ రవీంద్ర. సాధారణంగా రచిన్ రవీంద్ర బ్యాటర్‌గా గుర్తింపు పొందినప్పటికీ, ఈ ప్రపంచ కప్‌లో బౌలర్‌గా అదరగొడుతున్నాడు. ఇప్పటివరకు 8 మ్యాచ్‌ల్లో 6.88 ఎకానమీతో 11 వికెట్లు పడగొట్టి కివీస్ తరఫున టాప్ వికెట్ టేకర్‌గా నిలిచాడు. తన లెఫ్ట్ ఆర్మ్ స్పిన్‌తో ప్రత్యర్థి బ్యాటర్లను ముప్పుతిప్పలు పెడుతూ మ్యాచ్ విన్నర్‌గా మారుతున్నాడు.




ఒకప్పుడు స్పిన్ ఆడటంలో భారతీయులు దిట్టలు అనే పేరు ఉండేది. కానీ ఇటీవల కాలంలో టీమిండియా బ్యాటర్లు స్పిన్ బౌలింగ్‌లో తడబడుతున్నారు. ఈ టోర్నమెంట్‌లో యువ ఓపెనర్ అభిషేక్ శర్మ ఎక్కువ సార్లు స్పిన్నర్లకే వికెట్ పారేసుకోవడం ఆందోళన కలిగిస్తోంది. ఫామ్‌లో ఉన్న సంజు శాంసన్, సూర్యకుమార్ యాదవ్‌లను ఎడమచేతి వాటం స్పిన్నర్లతో కట్టడి చేయడం కివీస్ ప్లాన్‌గా తెలుస్తుంది. రచిన్ రవీంద్రకు భారత పిచ్‌లపై ఉన్న అపారమైన అవగాహన ([illegible] అనుభవం) అతడిని మరింత ప్రమాదకారిగా మారుస్తోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. నరేంద్ర మోడీ స్టేడియంలోని పిచ్ స్పిన్నర్లకు సహకరిస్తే, రచిన్ రవీంద్ర భారత జట్టు విజయానికి అడ్డుగోడలా నిలిచే అవకాశం ఉందని అంటున్నారు. స్వదేశీ గడ్డపై ఆడుతున్నప్పటికీ, కివీస్ జెర్సీ ధరించిన ఈ భారత సంతతి ఆటగాడిని టీమిండియా ఎలా ఎదుర్కొంటుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. భారత విజయానికి కోచ్ గంభీర్, కెప్టెన్ సూర్య ఎలాంటి వ్యూహాలను అమలు చేయబోతున్నారు అనేది ఇప్పుడు ఉత్కంఠగా మారింది.

# గద్దర్ సినీ అవార్డుల ప్రకటన



- చిరంజీవికి ఎన్టీఆర్ జాతీయ అవార్డు
- కమలహాసన్‌కు పైడి జయరాజ్ అవార్డు
- సుద్దాల అశోక్ తేజకు సినారె అవార్డు
- ఉత్తమ చిత్రంగా రాజు వెడ్స్ రాంబాయి
- ఉత్తమ ద్వితీయ చిత్రంగా దండోరా
- ఉత్తమ తృతీయ చిత్రంగా ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్‌షో
- ఉత్తమ నటుడిగా నాగచైతన్య..
- ఉత్తమ నటిగా రష్మిక మందన్నా
- ఉత్తమ దర్శకుడిగా సాయిలు
- ఉత్తమ సంగీత దర్శకుడు - మార్క్ రాబిన్
- ఉగాది రోజు అవార్డుల బహుకరణ






**హైదరాబాద్,మార్చి7:** గద్దర్ సినీ అవార్డులను తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. 2025లో విడుదలైన చిత్రాలకు గద్దర్ అవార్డులను శనివారం ప్రకటించారు. అగ్ర నటుడు చిరంజీవిని ఎన్టీఆర్ జాతీయ పురస్కారంతో సత్కరించనున్నారు. ఇక, ప్రముఖ నటుడు కమల్ హాసన్‌ను పైడి జయరాజ్ అవార్డు, గేయ రచయిత సుద్దాల అశోక్ తేజను సినారె అవార్డు వరించింది. 2025 జనవరి 1 నుంచి డిసెంబర్ 31 వరకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ ద్వారా సర్టిఫికెట్ పొందిన చిత్రాలకు, షార్ట్‌ఫిల్మ్‌లకు ఈ అవార్డులు ప్రకటించారు. మార్చి 19 ఉగాది రోజున ఈ పురస్కారాల ప్రదానం జరగనుంది. ఈ ప్రకటన సినీ వర్గాల్లో, అభిమానుల్లో నూతన ఉత్సాహాన్ని నింపింది. గతేడాది ప్రారంభమైన ఈ పురస్కారాల పరంపర, ఈసారి మరిన్ని ప్రతిష్ఠాత్మక విభాగాలతో ముందుకు వచ్చింది. ముఖ్యంగా మెగాస్టార్ చిరంజీవికి 'ఎన్టీఆర్ నేషనల్' అవార్డు ప్రకటించడం విశేషం. తెలంగాణ ప్రభుత్వం నంది అవార్డుల స్థానంలో సినీ కళాకారులకు గద్దర్ అవార్డులను ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. దాదాపు దశాబ్ద కాలంపాటు నిలిచిపోయిన ప్రభుత్వ పురస్కారాల సంప్రదాయం రేవంత్‌రెడ్డి సర్కార్‌లో మళ్లీ ప్రారంభం కావడంతో కళాకారులకు ఎంతగానో ప్రోత్సాహంగా ఉందని సినీ ప్రముఖులు చెబుతున్నారు. ఈసారి ఉగాది రోజున సినీతారల సందడితో ఈ వేడుకను అత్యంత వైభవంగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిర్వహించనుంది. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్' రెండో విడత విజేతలను జ్యూరీ కమిటీ ప్రకటించింది. ఈ ఏడాది అవార్డుల్లో దిగ్గజ నటీనటులు, సాంకేతిక నిపుణులకు పెద్దపీట వేశారు. ఈ ఏడాది వివిధ విభాగాల్లో ఎంపికైన ప్రముఖుల జాబితాను ప్రకటించింది. స్పెషల్ అవార్డుల విభాగంలో ఎన్టీఆర్ జాతీయ అవార్డు - చిరంజీవిని వరించింది. రఘుపతి వెంకయ్య అవార్డు - రమేశ్ ప్రసాద్, పైడి జయరాజ్ అవార్డు - కమల్ హాసన్,నాగిరెడ్డి చక్రపాణి అవార్డు - అశ్వనీదత్,ఏఎన్ఆర్ అవార్డు - జయసుధ, టీఎల్.కాంతారావు అవార్డు - ఆర్.నారాయణ మూర్తి,సి.నారాయణ రెడ్డి అవార్డు - సుద్దాల అశోక్ తేజ,బీఎన్ రెడ్డి అవార్డు - సింగీతం శ్రీనివాసరావులను వరించాయి. ఇక ఉత్తమ చిత్రంగా రాజు వెడ్స్ రాంబాయి, ఉత్తమ ద్వితీయ చిత్రంగా దండోరా, ఉత్తమ తృతీయ చిత్రంగా ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షోలను ఎంపిక చేశారు. ఉత్తమ నటుడు - నాగచైతన్య (తండేల్),ఉత్తమ నటి - రష్మిక (ది గర్ల్ ఫ్రెండ్),ఉత్తమ దర్శకుడు - సాయిలు (రాజు వెడ్స్ రాంబాయి),బెస్ట్ ఫీచర్ ఫిల్మ్ అన్ నేషనల్ ఇంటిగ్రేషన్ - తండేల్,ఉత్తమ సందేశాత్మక చిత్రం - కోర్ట్,ఉత్తమ ప్రజాదరణ చిత్రం - సంక్రాంతికి వస్తున్నాం,ఉత్తమ నూతన దర్శకుడు - సాయి మార్తాండ్ (లిటిల్ హార్ట్స్),ఉత్తమ బాలల చిత్రం-అనగనగా ఉత్తమ సహాయ నటుడు - శివాజీ (దండోరా),ఉత్తమ సహాయ నటి - భూమిక (యుఫోరియా),ఉత్తమ సంగీత దర్శకుడు - మార్క్ రాబిన్ (దండోరా),ఉత్తమ గాయకుడు - అనురాగ్ కులకర్ణి (రాజు వెడ్స్ రాంబాయి),ఉత్తమ గాయని - సాహితీ చాగంటి (కన్నప్ప), ఉత్తమ బాలనటుడు - మాస్టర్ రోహన్ (ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో),ఉత్తమ కథా రచయిత - గుణశేఖర్ (యుఫోరియా),ఉత్తమ స్క్రీన్ ప్లే - అనిల్ రావిపూడి (సంక్రాంతికి వస్తున్నాం),ఉత్తమ గేయ రచయిత - నందకిశోర్ (కుబేర),ఉత్తమ సినిమాటోగ్రాఫర్ - కార్తీక్ ఘట్టమనేని (మిరాయ్),ఉత్తమ ఎడిటర్ - శ్రీకర్ ప్రసాద్ (మిరాయ్),ఉత్తమ ఆడియోగ్రాఫర్ - ఎం.ఆర్ రాధాకృష్ణన్ (కిష్కింధపురి),ఉత్తమ కొరియోగ్రాఫర్ - సందీప్ (ఛాంపియన్),ఉత్తమ ఆర్ట్ డైరెక్టర్ - తోటతరణి (ఛాంపియన్),ఉత్తమ మేకప్ ఆర్టిస్ట్ - గోవిందరాజు (అఖండ -2),ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్ - చంద్రకాంత్ (ఛాంపియన్),ఉత్తమ యాక్షన్ కొరియోగ్రాఫర్ - పీటర్ హెయిన్స్ (ఛాంపియన్),స్పెషల్ జ్యూరీ అవార్డుల కింద శ్రీరాజ్ రాచకొండ (23 ఫిల్మ్),చైతు జొన్నలగడ్డ (రాజు వెడ్స్ రాంబాయి),రోషన్ మేక (ఛాంపియన్),అనంతిక (8 వసంతాలు)కు దక్కాయి. గద్దర్ అవార్డులపై సినీరంగం హర్షం వ్యక్తం చేస్తోంది. ఈ అవార్డులను మార్చి 19న ఉగాది పర్వదినం సందర్భంగా అత్యంత వైభవంగా నిర్వహించే వేడుకలో ప్రదానం చేయనున్నారు. స్పెషల్ జ్యూరీ చైర్మన్‌గా ప్రముఖ నిర్మాత, దర్శకుడు తమ్మారెడ్డి భరద్వాజ నేతృత్వంలోని కమిటీ ఈ అవార్డులను ఎంపిక చేసింది.

## చిరుకు ఎన్టీఆర్ అవార్డు రావడం అభినందనీయం

### అవార్డు విజేతలకు శుభాకాంక్షలు తెలిపిన పవన్


### నాగచైతన్యకు అవార్డుపై నాగార్జున ఆనందం

**హైదరాబాద్, మార్చి 7:** అగ్ర కథానాయకుడు చిరంజీవిని ఎన్టీఆర్ జాతీయ పురస్కారం వరించింది. దీంతో ఆయనకు అభినందనలు చెబుతూ ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పోస్ట్ పెట్టారు. ఈ వార్త తనకెంతో సంతోషాన్నిచ్చిందని తెలిపారు. తెలుగు సినీ పరిశ్రమలో చిరంజీవి ప్రస్థానం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. గద్దర్ అవార్డులకు ఎంపికైన ప్రతి ఒక్కరికీ పవన్ శుభాకాంక్షలు తెలిపారు.


ఇక ఈ అవార్డు విజేతలకు అగ్ర కథానాయకుడు నాగార్జున కూడా సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. తన కుమారుడు నాగచైతన్యను ప్రత్యేకంగా అభినందించారు. చైతూ ఉత్తమ నటుడిగా ఎంపికైనందుకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. 'తండేల్' సినిమాలో అద్భుతంగా నటించాడని, ఈ అవార్డుకు అతడు అర్హుడని కొనియాడారు. 'దుల్ల కొడతా నాన్న' అంటూ తండేల్ డైలాగుకు హార్ట్ ఎమోజీ జోడించి అభినందించారు. తెలంగాణ ప్రభుత్వానికి నాగార్జున కృతజ్ఞతలు తెలిపారు. ఏయన్నార్ పేరుతో అవార్డును ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఏయన్నార్ అవార్డు జయసుధకు రావడం ఆనందంగా ఉందన్నారు.తాజాగా ప్రకటించిన గద్దర్ అవార్డుల్లో ఈటీవీ విన్ సత్తా చాటింది. నాణ్యమైన కంటెంట్‌తో కుటుంబ ప్రేక్షకులను అలరించేందుకు ఎప్పుడూ ముందుండే ఈటీవీ విన్ ఏకంగా 6 అవార్డులను సొంతం చేసుకుంది. ఈ సంస్థ నిర్మించిన రాజు వెడ్స్ రాంబాయి 4 అవార్డులకు ఎంపిక కాగా.. ఉత్తమ ఫీచర్ ఫిల్మ్ (డెబ్యూ)గా లిటిల్ హార్ట్స్, ఉత్తమ బాలల చిత్రంగా అనగనగా నిలిచాయి.



## దీపికకు మద్దతు ప్రకటించిన అనన్య పాండే



ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారిన వర్కింగ్ అవర్స్ అంశంపై తాజాగా నటి అనన్య పాండేమాట్లాడారు. కరీనా కపూర్, కల్యాణి ప్రియదర్శన్‌లతో కలిసి ఆమె 'ది హాలీవుడ్ రిపోర్టర్ ఇండియా' నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్నారు. ఇందులో వర్కింగ్ అవర్స్ గురించి ప్రస్తావించారు. 'దీపికా పదుకొణె అంకితభావం ఉన్న నటి. నేను ఆమెతో కలిసి పని చేశాను. అప్పుడు దీపిక ఎలాంటి డిమాండ్లు చేయలేదు. వర్క్‌షాప్‌లకు కూడా వచ్చేవారు. షూటింగ్ విషయంలో ఎప్పుడూ ఫిర్యాదులు చేయలేదు. ఇప్పుడు ఆమె ఒక బిడ్డకు తల్లి. ఆ పాపకు కనీసం రెండేళ్లు అయినా పూర్తిగా దీపిక అవసరం ఉంటుంది. అందుకే ఇప్పుడు ఇలాంటి డిమాండ్ చేశారు. ఇందులో తప్పేం లేదు. ఆమె డిమాండ్‌కు పూర్తి మద్దతు ఇస్తాను' అని అనన్య అన్నారు. కరీనా తల్లి అయిన తర్వాత ఇండస్ట్రీలో పాత ఆలోచనా ధోరణిని మార్చేశారని అనన్య అభిప్రాయపడ్డారు. ఆమె తీసుకున్న కొన్ని నిర్ణయాలు ఇప్పుడు వస్తోన్న హీరోయిన్లకు ఎంతో ధైర్యాన్ని ఇస్తున్నాయన్నారు. పరిశ్రమలో హీరోయిన్స్ తమ వ్యక్తిగత జీవితానికి, వృత్తికి మధ్య సమతుల్యత పాటించేలా నిర్మాతలతో చర్చలు జరపడంలో తప్పులేదని అనన్య పేర్కొన్నారు. పని వేళల విషయంలో ఎటువంటి కఠినమైన నిబంధనలు ఉండకూడదన్నారు. దీపికా లాంటి స్టార్ హీరోయిన్ ఇలాంటి మార్పును డిమాండ్ చేయడం వల్ల భవిష్యత్తులో అందరికీ మేలు జరుగుతుందని పేర్కొన్నారు.



## ఉస్తాద్ భగత్‌సింగ్.. నెట్‌ఫ్లిక్స్‌తో కుదరిన డీల్

ఉస్తాద్ భగత్ సింగ్'గా ప్రేక్షకుల్ని పలకరించేందుకు సిద్ధమవుతున్నారు కథానాయకుడు పవన్ కల్యాణ్ . ఆయన ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రాన్ని హరీశ్ శంకర్ తెరకెక్కించిన సంగతి తెలిసిందే. మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో సినిమా ప్రచారంలో భాగంగా వరుస ఇంటర్వ్యూల్లో పాల్గొంటున్న హరీశ్ శంకర్ ఆసక్తికర విషయాలను పంచుకుంటున్నారు. సినిమా షూటింగ్ ప్రారంభమైన కొన్ని రోజుల్లోనే ఓటీటీ డీల్ కుదిరినట్లు ఆయన తాజాగా తెలిపారు. తన వ్యక్తిగత పరిశీలన కోసం కీలక సన్నివేశాలను ఎడిట్ చేసి ఒక చిన్న వీడియో సిద్ధం చేసుకున్నానని.. ఆ విజువల్స్ చూసిన నెట్‌ఫ్లిక్స్ ప్రతినిధులు సినిమాపై సంతృప్తి వ్యక్తం చేశారని హరీశ్ శంకర్ పేర్కొన్నారు. ఆ క్లిప్స్‌లోని కంటెంట్, మేకింగ్ స్టైల్ నచ్చడంతో 20 నిమిషాల్లోనే డీల్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని ఆయన వివరించారు. రూ.80కోట్ల కు ఈ సినిమా ఓటీటీ డీల్ కుదిరినట్లు తెలుస్తోంది. మైత్రీ మూవీ మేకర్స్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రంలో శ్రీలీల, రాశీ ఖన్నా కథానాయికలుగా నటిస్తున్నారు. 'గబ్బర్ సింగ్' వంటి ఇండస్ట్రీ హిట్ తర్వాత పవన్ - హరీశ్ కాంబోలో వస్తున్న సినిమా కావడంతో అంచనాలు భారీగా ఉన్నాయి. ఓవర్సీస్‌లో దీని బుకింగ్స్ కూడా ప్రారంభమైన విషయం తెలిసిందే.

Printed, Published and Owned by **SHAIK FAREED,** and Printed at Sunday Printing Press, 3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006. and Published from 6-1-303, SIDDIPET, TELANGANA - 505528, Telangana State. Editor: **SHAIK FAREED.** RNI NO : **TGTEL/25/A1737** Email: netisakshinews@gmail.com. Phone No: **9119949944, 9666052221**

# మెట్‌పల్లిలో పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే నిర్వహణ

- ప్రజల ఉపాధి స్థితిగతులపై గణాంక శాఖ అధ్యయనం
- జాతీయ గణాంక శాఖ ఆధ్వర్యంలో సర్వే



**నేటి సాక్షి -- మెట్‌పల్లి :** జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణంలో జాతీయ గణాంక శాఖ ఆధ్వర్యంలో పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే నిర్వహించారు. ప్రజల ఉపాధి పరిస్థితులు, జీవనోపాధి మార్గాలపై సమగ్ర సమాచారం సేకరించేందుకు ఈ సర్వే చేపట్టినట్లు అధికారులు తెలిపారు. కరీంనగర్ గణాంక శాఖ అధికారి గుర్రం శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో సర్వే ప్రక్రియ కొనసాగింది.

### ఉపాధి పరిస్థితులపై వివరాల సేకరణ

ఈ సందర్భంగా అధికారి గుర్రం శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ప్రజల ఉపాధి స్థితిగతులను అంచనా వేయడానికి ఈ సర్వే ఎంతో కీలకమని తెలిపారు. కుటుంబాల వివరాలు, సభ్యుల విద్యా అర్హతలు, ఉద్యోగాల స్వభావం, స్వయం ఉపాధి, రోజువారీ కూలీ పనులు వంటి అంశాలపై వివరాలను సేకరిస్తున్నట్లు చెప్పారు. అలాగే వ్యక్తులు రోజుకు ఎంతసేపు పని చేస్తున్నారో, వారికి లభిస్తున్న వేతనాల వివరాలు వంటి అంశాలను కూడా నమోదు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

### ట్యాబ్‌ల ద్వారా డేటా నమోదు

సర్వే ప్రక్రియను ఆధునిక సాంకేతికతతో నిర్వహిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. సేకరించిన సమాచారాన్ని ట్యాబ్‌ల ద్వారా నేరుగా డిజిటల్ రూపంలో నమోదు చేస్తున్నామని తెలిపారు. దీనివల్ల సమాచారం త్వరగా ప్రభుత్వానికి చేరి, ఉపాధి పరిస్థితులపై సరైన అంచనాలు వేయడానికి ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ సర్వే కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ హెచ్.ఎం. స్పందన, మున్సిపల్ అధికారులు, వార్డ్ ఆఫీసర్లు మరియు సిబ్బంది పాల్గొన్నారు. ప్రజల సహకారంతో సర్వేను విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు కృషి చేస్తున్నారు.

# పాఠశాలల్లో ముందస్తు మహిళా దినోత్సవ వేడుకలు



### మహిళా ఉపాధ్యాయులకు ఘన సన్మానం

**నేటి సాక్షి, ఎండపల్లి:** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎండపల్లి మండల కేంద్రం, కొండాపూర్, గుల్లకోట గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలల్లో శనివారం ముందస్తు మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో మహిళల సాధికారత, సమాజంలో వారి పాత్రను గుర్తు చేస్తూ పలు అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. కాగా విద్యార్థులు మహిళల గొప్పతనాన్ని చాటిచెప్పే ప్రసంగాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం పాఠశాలలో సేవలందిస్తున్న మహిళా ఉపాధ్యాయురాలను పూలమాలలు వేసి, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ మహిళలు ప్రతి రంగంలోనూ ప్రతిభ కనబరుస్తూ సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని, మహిళా విద్యాభివృద్ధి వల్లే సమాజం ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో మహిళా ఉపాధ్యాయురాల కృషి ఎంతో గొప్పదని కొనియాడుతూ.. మహిళల పట్ల గౌరవ భావం కలిగి ఉండాలని, సమాన హక్కులు, అవకాశాలు కల్పించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో ఎండపల్లి సర్పంచ్ మారం సునీత–జలేందర్ రెడ్డి, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు దాశెట్టి రవీందర్ రెడ్డి (ఎండపల్లి), చుక్క మల్లికార్జున్ (కొండాపూర్), చందూరి రాజిరెడ్డి (గుల్లకోట), స్థానిక ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల జిల్లా,, మార్చి 7, నేటి సాక్షి :** జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డు లో నిర్మితమవుతున్న ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం పనులను ఆకస్మికంగా సందర్శించి పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందుబాటులో ఉంచేందుకు ప్రభుత్వం ఆసుపత్రి నిర్మాణ పనులను చేపట్టిందని, ఈ క్రమంలో పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. 129.25 కోట్ల రూపాయలతో ప్రభుత్వ ఆసుపత్రి, 23.75 కోట్ల రూపాయలతో క్రిటికల్ కేర్ విభాగం ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. వైద్య రంగాన్ని బలోపేతం చేస్తూ



ప్రజలకు వేగవంతమైన, మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. అనంతరం సాయికుంట ప్రాంతంలో నిర్మిస్తున్న ప్రభుత్వ నర్సింగ్ కళాశాల నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గజ్వేల్‌లో అక్రమ రేషన్ వ్యాపారులపై పోలీసుల దాడులు



### పేదల బియ్యంపై దందా...

**నేటి సాక్షి గజ్వేల్:** సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని ఆర్ అండ్ ఆర్ కాలనీ పల్లెపాడు ప్రాంతంలో అక్రమంగా రేషన్ బియ్యం వ్యాపారం సాగిస్తున్న వారిపై పోలీసులు, ఎన్ఫోర్స్మెంట్ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ముందస్తు సమాచారంతో అధికారులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి పలుచోట్ల తనిఖీలు చేపట్టారు. ఈ దాడుల్లో భారీ మొత్తంలో రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అధికారుల వివరాల ప్రకారం, కొంతమంది వ్యక్తులు పేదలకు ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి గోదాముల్లో నిల్వ చేసి, తర్వాత ఎక్కువ ధరలకు ఇతర ప్రాంతాలకు అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు, ఎన్ఫోర్స్మెంట్ అధికారులు కలిసి దాడులు నిర్వహించగా బియ్యం సంచులు, రవాణాకు ఉపయోగిస్తున్న వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాల ద్వారా పేదల కోసం అందిస్తున్న రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేయడం, విక్రయించడం చట్ట విరుద్ధమని స్పష్టం చేశారు. ఇటువంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేసి విచారణ కొనసాగిస్తున్నట్లు తెలిపారు. అలాగే ప్రజలు కూడా రేషన్ బియ్యం అక్రమ రవాణా లేదా నిల్వల గురించి సమాచారం ఉంటే పోలీసులకు లేదా సంబంధిత అధికారులకు తెలియజేయాలని కోరారు. ప్రజల సహకారంతో ఇటువంటి అక్రమ దందాలను పూర్తిగా అరికట్టేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు వెల్లడించారు.

# వివాహ వార్షికోత్సవానికి హాజరైన కాకులమర్రి దంపతులు

**నేటిసాక్షి/ములుగు ప్రతినిధి :** మంగపేట మండలం కమలాపురం గ్రామానికి చెందిన సిద్ధంశెట్టి ఆనందం మహాలక్ష్మి 50వ వివాహ వార్షికోత్సవం (గోల్డెన్ జూబ్లీ) కి బిఆర్ఎస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు ఏటూరునాగారం సర్పంచ్ కాకులమర్రి శ్రీలత దంపతులు హాజరై సిద్ధంశెట్టి ఆనందం మహాలక్ష్మి దంపతులకు శాలువా కప్పి పరిస్పర ప్రేమ అనురాగం కుటుంబ విలువలతో కలసి మెలసి జీవిస్తూ అందరికీ ఆదర్శంగా నిలవాలని కాకులమర్రి దంపతులు కొనియాడారు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేసారు అలాగే నిండు నూరేళ్లు ఆరోగ్యాంగా ఆనందంగా మరెన్నో సంవత్సరాలు సుఖశాంతులతో జీవించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేసారు ఈ కార్యక్రమంలో కమలాపురం బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు తుక్కాని శ్రీనివాస్ పప్పు వెంకటరెడ్డి సొసైటీ మాజీ డైరెక్టర్ సిద్ధంశెట్టి లక్ష్మణరావు యలవర్తి శ్రీనివాసరావు



కర్ర రవీందర్ కాజా పాషా కుమ్మరి చంద్రబాబు రెడ్డి ప్రమీళ కాకుల మర్రి అరుణ బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# చిలుకూరులో ఘనంగా మహిళా దినోత్సవంలి




**నేటి సాక్షి చిలుకూరు :** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పీఎం శ్రీ జెడ్ పి హెచ్ ఎస్ ఉన్నత పాఠశాల చిలుకూరు నందు పాఠశాల మహిళా ఉపాధ్యాయుని బోధ నేతర సిబ్బందిని సన్మానించారు మహిళా దినోత్సవం మహిళలు సామాజికంగా ఆర్థికంగా సాంస్కృతికంగా మరియు రాజకీయ రంగాలలో విజయాలు సాధించాలని ఆ విజయాల ద్వారా గుర్తించబడాలని సమానమైన హక్కులు సమానత్వం సాధికారత కోసం మహిళలు పాటుపడాలని ఇల్లాలి చదువు ఈ జగతికి వెలుగుని నింపుతుందని మహిళ దినోత్సవ సందర్భంగా స్థానిక సర్పంచ్ శ్రీమతి కొల్లు పుల్లమ్మ నాగయ్య అన్నారు.. ఈ కార్యక్రమంలో రంజాన్ బి హెడ్మాస్టర్ రాజారాం మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు

# చిలుకూరులో మెడికల్ క్యాంప్ విజయవంతం



**నేటి సాక్షి చిలుకూరు :** సూర్యాపేట జిల్లా చిలుకూరు మండల కేంద్రంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు ఫ్రీ మెడికల్ క్యాంప్ నిర్వహించారు.. ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ కొల్లు పుల్లమ్మ నాగయ్య ప్రారంభించారు... ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ వైద్య శిబిరానికి 222 మందికి పైగా వైద్య సేవలు పొందారు. శిబిరానికి వచ్చిన ప్రజలకు వైద్యులు పరీక్షలు నిర్వహించి. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ సుభాష్ యశ్వంత్ డెంటల్ పెరిక రవికుమార్ మీనాక్షి ఆర్థోపెటిక్ చిలుకూరు సర్పంచ్ కొల్లు పులమ్మ నాగయ్య వార్డ్ మెంబర్లు హాస్పిటల్ సిబ్బంది గ్రామ పెద్దలు ప్రజలు పాల్గొన్నారు..

# అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేసిన గ్రామ సర్పంచ్

మండల జయమ్మ వెంకటేశ్వర్లు....



**నేటి సాక్షి..చిలుకూరు :** సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం నారాయణపురం గ్రామంలో నాలుగు అంగన్వాడి సెంటర్లను పరిరక్షణలో భాగంగా ఈరోజు పిల్లల పోషణ నిమిత్తం గ్రామ సర్పంచ్ మండవ జయమ్మ వెంకటేశ్వర్లు తనిఖీ చేసి పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారం, హాజరు నమోదు, పరిశుభ్రత, మౌలిక సదుపాయాలు విద్యా కార్యక్రమాలు వంటి అంశాలను సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం గర్భిణీ స్త్రీలకు అందుతుందనే అంశాన్ని పరిశీలించారు. మరింత మెరుగుదలకు అవసరమైన సూచనలు చేశారు. పిల్లల ఆరోగ్యం, అభివృద్ధి విషయంలో ఎలాంటి లోపాలు ఉండకూడదని సంబంధిత సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గండలింగస్వామి వార్డు నెంబర్లు, అంగన్వాడి టీచర్లు విజయలక్ష్మి సుశీల భారతి పార్వతి సిబ్బంది గర్భిణీ స్త్రీలు, బాలింత మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక



**నేటి సాక్షి,చేర్యాల :** చేర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం రోజున ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక రెండో రోజు కార్యక్రమంలో భాగంగా కళాశాల పరిధిలో పిచ్చి మొక్కలను ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించడం జరిగింది . అదేవిధంగా చెట్లను మొక్కలను అందంగా తీర్చిదిద్దడం జరిగింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని ప్రభుత్వ డిగ్రీ కళాశాల చేర్యాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ కే ప్రణీత చేర్యాల మూడో వార్డు కౌన్సిలర్ కొమ్ము రాజేశ్వరి ని సత్కరించడం జరిగింది . ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థులు తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని అంతేకాక విద్యలో రాణించాలని మంచి భవిష్యత్తు నిర్మించుకోవాలని సూచనలు చేశారు ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం మరియు విద్యార్థిని విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు

# పండుగలు పోయే... రైతుబంధు రాకపోయే

- న్యూ ఇయర్, సంక్రాంతి, శివరాత్రి, హోలీ పండుగలు గడిచినా రైతులకు అందని రైతుబంధు
- ఈ పంటకు... ఆ పంటకు అంటూ రైతులను అంతులేని హామీలతో ఊరడిస్తున్న ప్రభుత్వం
- రూ. 9 వేల కోట్లకు పైగా రైతులకు ఇవ్వాల్సిన నిధులపై స్పష్టత లేని పరిస్థితి
- ఫిబ్రవరి 17న రైతుబంధు అనుకున్నా... ఇంకా ఖాతాల్లో జమ కాని డబ్బులు
- విత్తనాలు, ఎరువుల కొనుగోళ్లకు డబ్బులేక రైతులు తీవ్ర ఇబ్బందులు

**నేటి సాక్షి మహబూబాబా ద్ మార్చి 7 :** రాష్ట్రంలో రైతులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రారంభించిన రైతుబంధు పథకం ఈసారి అమలులో తీవ్ర ఆలస్యం జరుగుతుండటంతో రైతుల్లో ఆందోళన పెరుగుతోంది. ప్రతి పంట సీజన్ ప్రారంభానికి ముందు రైతుల ఖాతాల్లో నిధులు జమ చేయాల్సిన ప్రభుత్వం ఈసారి ఇప్పటికీ స్పష్టమైన నిర్ణయం తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికే న్యూ ఇయర్, సంక్రాంతి, మహాశివరాత్రి, హోలీ వంటి ప్రధాన పండుగలు గడిచిపోయినా రైతుబంధు నిధులు రైతుల ఖాతాల్లో జమ కాకపోవడం రైతుల్లో తీవ్ర నిరాశ కలిగిస్తోంది. రైతుబంధు పథకం తెలంగాణలో రైతులకు ముఖ్యమైన ఆర్థిక సహాయకంగా భావించబడుతోంది. ప్రతి సీజన్‌కు రైతుల పంట సాగుకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేసేందుకు ఈ పథకం ద్వారా ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తుంది. అయితే ఈసారి నిధుల విడుదలలో ఆలస్యం కావడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంట సాగు ప్రారంభించాల్సిన సమయంలో రైతుల చేతుల్లో డబ్బు లేకపోవడం వల్ల వ్యవసాయ పనులు నిలిచిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 70 లక్షల మంది రైతులు రైతుబంధు నిధుల కోసం ఎదురుచూస్తున్నారని అంచనా. రైతులకు ఇవ్వాల్సిన మొత్తం నిధులు రూ. 9 వేల కోట్లకు పైగా ఉంటాయని వ్యవసాయ వర్గాలు చెబుతున్నాయి. ఇంత పెద్ద మొత్తాన్ని విడుదల చేయడంలో ప్రభుత్వం ఆర్థిక సమస్యలను ఎదుర్కొంటోందన్న ప్రచారం కూడా వినిపిస్తోంది. ఖజానాపై ఉన్న ఒత్తిడి కారణంగానే రైతుబంధు విడుదల ఆలస్యమవుతోందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మరోవైపు ప్రభుత్వం ఫిబ్రవరి 17 నుంచి రైతుబంధు నిధులు విడుదల చేస్తామని ప్రకటించినప్పటికీ ఇప్పటివరకు ఆ ప్రకటన అమలు కాలేదని రైతులు ఆరోపిస్తున్నారు. దీనిపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రకటన లేకపోవడంతో రైతుల్లో అయోమయం నెలకొంది. రైతుబంధు ఎప్పుడు వస్తుందో తెలియక రైతులు ఎదురుచూస్తున్నారు. ఇక కొన్ని జిల్లాల్లో భూ రికార్డుల సమస్యలు, కొత్త పట్టాదారుల




నమోదు, వారసత్వ మార్పులు వంటి అంశాలు కూడా రైతుబంధు నిధుల పంపిణీకి ఆటంకంగా మారుతున్నాయని అధికారులు చెబుతున్నారు. అయితే రైతులు మాత్రం ఈ కారణాలను అంగీకరించడం లేదు. ప్రభుత్వం కావాలనే రైతుబంధు నిధులను ఆలస్యం చేస్తోందని ఆరోపిస్తున్నారు. రైతు సంఘాలు కూడా ఈ అంశంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. రైతులకు సరైన సమయంలో రైతుబంధు నిధులు అందకపోతే రైతులు అప్పులు చేసి పంట సాగు చేయాల్సిన పరిస్థితి వస్తుందని హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే వ్యవసాయ వ్యయాలు భారీగా పెరిగిన నేపథ్యంలో రైతులకు ఈ సహాయం అత్యంత అవసరమని వారు పేర్కొంటున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం త్వరగా స్పందించి రైతుబంధు నిధుల విడుదలపై స్పష్టత ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. రైతుల సమస్యలను అర్థం చేసుకుని వెంటనే నిధులు విడుదల చేయాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా రైతుల నిరసనలు మరింత ఉధృతం అయ్యే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# జనం వీడి వనంలోకి నాగులమ్మ- ఐదు రోజులుగా సాగిన మహా జాతర

- వన ప్రవేశంతో ముగిసిన నాగులమ్మ మహా జాతర

**నేటిసాక్షి /ములుగు ప్రతినిధి/మంగపేట :** ములుగు జిల్లా మంగపేట మండలం వాగొడ్డుగూడెం గ్రామపంచాయతీ పరిధిలో గల లక్ష్మీనర్సాపూర్ గ్రామంలో ఐదు రోజుల పాటు శ్రీ నాగులమ్మ మహా జాతర అంగరంగ వైభవంగా ఆదివాసీ సాంప్రదాయ బద్ధంగా జరిగింది.ఐదు రోజుల పాటు జరిగిన జాతరలో ములుగు జిల్లాతో పాటు ఇతర జిల్లాల నుండే కాకుండా ఆంధ్రప్రదేశ్ ఛత్తీస్ ఘడ్ మహారాష్ట్ర రాష్ట్రల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై నాగులమ్మ అమ్మవారిని దర్శించుకొని పూజలు మొక్కులు చెల్లించుకున్నారు జాతరలో చివరి రోజున మణి రూపంలో ఉన్న నాగులమ్మ అమ్మవారికి ,సడాలమ్మ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసిన పూజారులు గండోర్రె గుట్టకు నాగులమ్మ ను,ఎర్రట్టల గుట్ట కు సడాలమ్మ ను డోలు వాయిద్యాల నడుమ జనం నుండి వనానికి సాగనంపారు.ఈ సందర్భంగా భక్తులు చల్లగా కాపాడమని నాగులమ్మ ను వేడుకున్నారు.అమ్మవార్ల వనప్రవేశంతో జాతర ముగిసింది



ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మేనేజింగ్ ట్రస్టీ ప్రధాన పూజారి బాడిశ రామకృష్ణ స్వామి ,పూజ కార్యక్రమాలను పర్యవేక్షించగా నాగులమ్మ ఆలయ ప్రధాన పూజారి బాడిశ నాగరమేష్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించగా పూజారులు సోడి సత్యం,కుర్సం పుల్లయ్య, కట్టం సమ్మక్క,చౌళం భవాని,మడకం సుప్రజ,పోలిశెట్టి స్వరూప,వడ్డెలు కోర్స శ్రీకాంత్ ,మూయబోయిన శివ,తుర్స చిన్నబ్బాయి,కారం రాజేష్ పూజ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి కులపెద్దలు కుర్సం విష్ణుమూర్తి,మడకం రాజేశ్వర్ రావు,చౌళం వెంకటేశ్వర్లు ,కొమరం మాధవ రావు,కొమరం పాపారావు,ఇరప రామకృష్ణ,ఇందారపు రమేష్ పాల్గొన్నారు.

# రైతులు ఆయిల్ ఫామ్ తో లాభాలు పొందండి



- సాగు విస్తీర్ణంలో మంగపేట ముందంజ
- ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలని పిలుపు
- జిల్లా ఉద్యాన శాఖ అధికారి డి సంజీవరావు

**నేటిసాక్షి /ములుగు ప్రతినిధి :** మండలంలోని రాజుపేట రైతువేదికలో ఉద్యాన వనశాఖ అధికారి కొప్పిరి లావణ్య అధ్యక్షతన ఆయిలపామ్ పై రైతులకు అవగాహన సధస్సు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిధులు గా జిల్లా ఉద్యనవన శాఖ అధికారి సంజీవరావు, కె ఎన్ బయో సైన్సెస్ కంపెనీ ఏరియా మేనేజర్ హేమంత్ రెడ్డి హాజరయ్యారు. సంజీవరావు మాట్లాడుతూ తరతరాలుగా రైతులు సాంప్రదాయా వ్యవసాయం చేస్తూ నష్టాలను చవిచుస్తున్నారని ఉద్యనపంట ఐన ఆయిల్ ఫామ్ పై రైతులు దృష్టి సారిస్తే మంచి లాభాలు వస్తాయన్నారు. ఇతర పంటలకు ప్రత్యామ్నాయంగా ఆయిల్ ఫామ్ సాగవుతుందన్నారు. జిల్లాలో పామాయిల్ ఫ్యాక్టరీ రావడం శుభ పరిణామమని సాగు విస్తీర్ణంలో మంగపేట ముందంజలో ఉందని ప్రకటించారు. సాగులో పాటించవలసిన మెలకువలు, ప్రభుత్వం అందిస్తున్న అనేక రాయితీల గూర్చి వివరించారు. కేఎన్ బయోసైన్స్ కంపెనీ ఏరియా మేనేజర్ హేమంత్ రెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాంత రైతులు చైతన్యవంతులని ప్రభుత్వ చూచనలు పాటిస్తూ మున్ముందు సహచర రైతులను సైతం ఆయిల్ పామ్ పంట సాగుచేసేలా కృషి చేయాలన్నారు. ప్యాక్టరీ నిర్మాణపనులు జరుగుతున్నాయని సంవత్సరం లోపు ప్రారంభించే అవకాశం ఉందన్నారు. ఏటూరునాగారం డివిజన్ ఉద్యనశాఖ అధికారి కోపిరి లావణ్య మాట్లాడుతూ పంట సాగు విధానం మొదటి దశలో అంతరపంటల సాగు పంట కోత దశ తదితర విషయాల గురించి పూర్తి గా రైతులకు వివరించారు ఈ కార్యక్రమంలో స్థానిక ఏ ఈ ఓ మౌనిక, కంపెనీ ఎగ్జిక్యూట్ ఆఫీసర్స్ కట్కూరి సాంబశివరావు, సురేష్ రాజుపేట, బ్రాహ్మణపల్లి, సంగంపల్లి, నర్సింహాసాగర్, వాడగూడెం, బోర్ నర్సాపురం, మల్లూరు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# మరికల్ మండల పరిషత్ కార్యాలయంలో చెత్తాచెదారం..




పట్టించుకోని అధికారులు.....



**నారాయణపేట జిల్లా రిపోర్టర్, మార్చ్, 07) :** నారాయణపేట జిల్లాలోని మరికల్ మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో చెత్తాచెదారాలు పేరుకుపోయిన కార్యాలయం సిబ్బంది పట్టించుకోవడంలేదని కార్యాలయానికి వచ్చే వివిధ గ్రామాల ప్రజలు మండల లోని వివిధ గ్రామాలలో చర్చించుకుంటున్నారు. గతంలో గ్రామంలో ఉన్న పాత కార్యాలయం శుభ్రంగా ఉండేదని ప్రస్తుత పరిస్థితి దానికి భిన్నంగా ఉందని ప్రజలు చర్చించుకుంటున్నారు. కార్యాలయంలోకి వెళ్లగానే కాగితాలు, ఇల్లారా, చెత్త ,కనిపిస్తాయి తప్ప శుభ్రపరిచే నాధుడే లేదని వచ్చిన జనాలు చర్చించుకుంటున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి శుభ్రత కార్యక్రమాలు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు అధికారులను కోరుతున్నారు.

# ఒకే చీరపై భారత ఆడబిడ్డల విజయగాథలు

## నేతన్న హరిప్రసాద్ ప్రతిభకు నెటిజన్లు ఫిదా




**నేటి సాక్షి సిరిసిల శివకుమార్:** మహిళలు సాధించిన అపూర్వ విజయాలే స్ఫూర్తిగా సిరిసిల్ల చేనేత కళాకారుడు మరోసారి తన అద్భుత ప్రతిభతో అబ్బురపరిచేలా చీరను రూపొందించాడు.. సిరిసిల్లకు చెందిన చేనేత కళాకారుడు వెల్ది హరిప్రసాద్, రేఖా దంపతులు మూడు నెలల పాటు శ్రమించి ప్రత్యేకంగా చేనేత మగ్గం పై పట్టుచీర నేసారు. నారీ శక్తి స్ఫూర్తితో గత ఏడాది భారత దేశ ఆడబిడ్డలు ఎన్నో ఘనవిజయాలు సాధించారని, ముఖ్యంగా ఆపరేషన్ సింధూర్ దేశ మహిళల సత్తా ఏంటో ప్రపంచానికి చాటి చెప్పారని గుర్తు చేశారు. క్రీడారంగంలోనూ ఆడబిడ్డలు ఎన్నో గొప్ప విజయాలు సాధించారన్నారు. వారి విజయాలన్నీటిని ప్రతిబింబించేలా చేనేత చీరను నేడం జరిగిందని తెలిపారు. దేశ గొప్పతనాన్ని చాటిన ఆడబిడ్డలు అందరికీ అభినందనలు తెలపాలన్న ఉద్దేశంతో ఈ ప్రత్యేకమైన పట్టుచీరను నేసినట్లు తె లిపారు. దేశ మహిళలు సాధించిన విజయాలు ఆప రేష న సింధూర్తోపాటు షూటర్ సుజిత్ సింగ్ ముఖచిత్రాలు, మహిళా క్రికెట్ వరల్డ్ కప్, మహిళా కబడ్డీ వరల్డ్ కప్, అంధుల మహిళా క్రికెట్ వరల్డ్ కప్, ఆర్చర్ సీతల్ దేవి జ్యోతి చిత్రాలతో రూపొందించిన చీర విశేషంగా ఆకట్టుకుంటుంది.ఒకే చీరపై ఇమిడేలా దేశ మహిళల విజయాలను అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మరోసారి గుర్తుచె యాలని ప్రత్యేకమైన చీరను సిద్ధం చేశామని, ఈ చీరపై ఉన్న విజయాలను వారిని గుర్తు చేస్తూ వారికి అంకితం చేస్తున్నామని తెలిపారు.నారీశక్తి స్ఫూర్తితో ఈ ఏడాది మన దేశ ఆడబిడ్డలు ఎన్నో ఘన విజయాలు సాధించారు. ముఖ్యంగా ఆపరేషన్ సింధూర్ ప్రపంచానికి మన ఆడబిడ్డల సత్తా చాటుకున్నారు. అలాగే విధంగా క్రీడా రంగంలోనూ మన ఆడబిడ్డలు ఈ ఏడాది ఎన్నో గొప్ప విజయాలు సాధించారు. వారి విజయాలన్నింటినీ చేనేత చీర పై నేసి వారికి అభినందనలు తెలుపాలన్న ఉద్దేశంతో ప్రత్యేకమైన పట్టు చీరను వేశారు.

# బావిలో బాలుడి మృతదేహం లభ్యం

## హోలీ ఆడేందుకు వెళ్లి తిరిగి రాని బాలుడు... రేచపల్లిలో విషాదం



**నేటి సాక్షి -- జగిత్యాల బ్యూరో ( రాధారపు నర్సయ్య ) :** జగిత్యాల జిల్లాలోని సారంగపూర్ మండలం రేచపల్లి గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పవన్ తేజ (10) అనే బాలుడు శనివారం సాయంత్రం బావిలో మృతదేహంగా లభ్యమయ్యాడు. ఈ ఘటనతో గ్రామంలో తీవ్ర విషాద వాతావరణం నెలకొంది. గ్రామానికి చెందిన చిన్నోజి రమేశ్ -- జ్యోస్న దంపతుల కుమారుడు పవన్ తేజ ఈ నెల 3న హోలీ పండుగ సందర్భంగా స్నేహితులతో కలిసి ఆడుకోవడానికి వెళ్లాడు. అయితే సాయంత్రం అయినా బాలుడు ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. అనంతరం గ్రామ పరిసర ప్రాంతాల్లో బంధువులు, గ్రామస్థులతో కలిసి బాలుడి కోసం గాలింపు చేపట్టారు. గాలింపు జరుగుతున్న సమయంలో గ్రామ సమీపంలోని ఓ బావిలో బాలుడి మృతదేహం తేలుతూ కనిపించింది. దీనిని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి వివరాలు సేకరించారు.ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. బాలుడి మృతికి గల కారణాలపై విచారణ కొనసాగిస్తున్నారు. పవన్ తేజ మృతితో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.

# సంఘటిత పోరాటాలతోనే సమాన హక్కులు

## సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు మారెళ్ళ శ్రీలత




**నేటిసాక్షి, కరీంనగర్ :** సంఘటిత పోరాటాలతోనే సమాన హక్కులు, సమాన వేతనాలు సాధ్యమని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు మారెళ్ళ శ్రీలత పిలుపునిచ్చారు. ముకుందలాల్ మిశ్ర భవనంలో శనివారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ జిల్లా సదస్సు నిర్వహించారు. మారెళ్ళ శ్రీలత మాట్లాడుతూ దేశ జనాభాలో 48%గా ఉన్న మహిళల విద్య, ఆరోగ్యం, ఆర్థిక అభివృద్ధి, భద్రత తదితర అంశాలు పరిశీలిస్తే మహిళా వివక్ష స్పష్టంగా కనిపిస్తుందన్నారు. భారత దేశ అభివృద్ధిలో మహిళా భాగస్వామ్యం లేకుంటే అసంపూర్ణ కథ చిత్రం గా మారుతుందని, దేశ స్థూల జాతీయ ఉత్పత్తిలో మహిళ వాటా 18% గా ఉన్న మహిళ సాధికారత లోపం, వివక్ష బీజేపీ ప్రభుత్వం చూపిస్తుందన్నారు. భారతీయ సంస్కృతి లో గొప్ప స్థానం ఉందని చెప్పిన ఆచరణలో తీవ్రస్థాయిలో దురాచారాలు, అకృత్యాలు, మహిళల మీద బిన్న రూపాల్లో దాడులు జరుగుతున్నాయని తెలిపారు. నేషనల్ క్రైమ్ రికార్డ్ బ్యూరో ప్రకారం 4.45 లక్షల నేరాలు జరిగాయని నివేదిక తెలిపిందని, ఎటువంటి జీతం భత్యాలు లేని మహిళలు పురుషుల కంటే పది రెట్లు ఎక్కువ ఉన్నారని పేర్కొన్నారు. సమాన పనికి సమాన వేతనం,సమాన హక్కులు, పని ప్రదేశాలలో రక్షణ, సెలవులు, ఉచిత న్యాయ సహాయం, పని భద్రత లేకుండా నాలుగు లేబర్ కోడ్స్ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిందని తెలిపారు. మహిళా ప్రజా ప్రతినిధుల నుండి మొదలుపెడితే కింది అసంఘటిత రంగ కార్మికులకు ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. అందుకని శ్రామిక మహిళ లోకం,ప్రజలు కలిసి సంఘటిత ఉద్యమాలు నిరంతరం కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఎడ్ల రమేష్, జిల్లా సహాయ కార్యదర్శి పున్నం రవి, ఉప్పునూటి మానస, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహిళా కన్వీనర్ ముక్కెర బుజ్జమ్మ, శాతవాహన యూనివర్సిటీ మహిళా కన్వీనర్ దయమని,ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కాల్వ సారిక,జిల్లా ఉపాధ్యక్షులు నాగెల్లి పద్మ, బాయిని ప్రియంక, బూడిద రజిత, సహాయ కార్యదర్శిలు సరిత, స్వరూప, సుమలత తదితరులు పాల్గొన్నారు.

# చింతకుంట స్మశాన వాటిక స్థలం కబ్జాపై చర్యలు

- అక్రమ షెడ్డు, గోడలను తొలగించిన మున్సిపల్ అధికారులు
- ఫిర్యాదుకు స్పందించిన అధికారులు

**నేటి సాక్షి -- జగిత్యాల బ్యూరో ( రాధారపు నర్సయ్య ) :** జగిత్యాల పట్టణంలోని చింతకుంట స్మశాన వాటిక స్థలం మరియు చెరువు ప్రాంతం కబ్జాకు గురవుతోందని మున్సిపల్ కమిషనర్‌కు మున్సిపల్ కౌన్సిలర్లు వినతిపత్రం సమర్పించారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన మున్సిపల్ అధికారులు పరిశీలన చేపట్టి అక్కడ ఏర్పాటు చేసిన అక్రమ షెడ్డు మరియు గోడలను తొలగించారు. ప్రజా అవసరాలకు సంబంధించిన స్థలాలను కబ్జా చేయడం సరికాదని అధికారులు హెచ్చరించారు.



### స్మశాన వాటిక, చెరువు రక్షణపై దృష్టి

చింతకుంట ప్రాంతంలోని స్మశాన వాటిక స్థలం, చెరువు పరిసరాలు కొంతమంది వ్యక్తుల అక్రమ నిర్మాణాలకు గురవుతున్నాయని స్థానిక ప్రజలు, కౌన్సిలర్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. దీనిపై అధికారులు స్పందించి స్థలాన్ని పరిశీలించి అక్రమంగా నిర్మించిన షెడ్డు, గోడలను తొలగించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కౌన్సిలర్లు లింగంపేట శ్రీనివాస్, అరవ లక్ష్మీ, పంబల సుజాత రాము, కొండ అరుణ, సిరికొండ వరలక్ష్మీ, నిమ్మల నాగరాజు, గట్టపల్లి మానస, జ్ఞానేశ్వర్, దుబ్బ శ్రవణ్, వినీత్ గౌడ్, మధు, శ్రీరామ్, బిట్టు తదితరులు పాల్గొన్నారు. ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన స్థలాలను కాపాడేందుకు తమ వంతు కృషి కొనసాగుతుందని వారు తెలిపారు.

# ఎంపీ వ్యాఖ్యలు అనవసరం -- అభివృద్ధే నా ఎజెండా



- కేంద్రీయ విద్యాలయం అంశంపై పూర్తి ఆధారాలు ఉన్నాయన్న ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్

**నేటి సాక్షి -- జగిత్యాల బ్యూరో ( రాధారపు నర్సయ్య ) :** జగిత్యాల పట్టణంలోని మోతే రోడ్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ మీడియా సమావేశం నిర్వహించి ఎంపీ అరవింద్ చేసిన విమర్శలకు సమాధానం ఇచ్చారు. కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు విషయంలో తాను కాలయాపన చేస్తున్నానని ఎంపీ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ, తనపై వ్యక్తిగతంగా విమర్శలు చేయడం సరైంది కాదన్నారు. తాను ఎప్పుడూ వ్యక్తిగత విమర్శలకు ప్రాధాన్యం ఇవ్వనని, జగిత్యాల అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

### కేంద్రీయ విద్యాలయం అంశంపై వివరణ

కేంద్రీయ విద్యాలయం స్థలం విషయంలో తాను చేసిన ప్రతి చర్యకు పూర్తి ఆధారాలు ఉన్నాయని ఎమ్మెల్యే తెలిపారు. 2025 నవంబర్‌లో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి స్థలం కేటాయింపు విషయమై లేఖ రాసినట్లు పేర్కొన్నారు. మంత్రి ఆ లేఖను ఎండార్స్ చేసిన పత్రాలు కూడా ఉన్నాయని, అవసరమైతే వాటిని బయటపెట్టేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. సోషల్ మీడియా యుగంలో ఏ విషయం దాచలేమని, తాను ఎలాంటి ఫోర్జరీ చేయలేదని స్పష్టం చేశారు.

### విద్యాసంస్థల ఏర్పాటుకు కృషి

ఇంటిగ్రేటెడ్ స్కూల్ కాంప్లెక్స్, కేంద్రీయ విద్యాలయం, మినీ స్టేడియం ఏర్పాటుకు అవసరమైన స్థలం కేటాయించాలని జిల్లా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ముఖ్యమంత్రికి వినతిపత్రాలు సమర్పించినట్లు తెలిపారు. చల్గల్ వాలాంతరి ప్రాంతంలో సుమారు 80 ఎకరాల భూమి అందుబాటులో ఉందని, అక్కడి స్థలాన్ని అధికారులు సర్వే చేసి ఐదు ఎకరాలను ప్రతిపాదించినట్లు చెప్పారు. కొన్ని సందర్భాల్లో పరిపాలనా కారణాలతో ఆలస్యం సహజమని, దాన్ని వ్యక్తిగతంగా విమర్శించడం సరికాదన్నారు.

### కేంద్ర నిధులపై ప్రశ్నలు

జగదల్‌పూర్ -- నిజామాబాద్ జాతీయ రహదారిపై అనంతారం బ్రిడ్జి, రాయికల్ సింగరావుపేట బ్రిడ్జి నిర్మాణాలకు నిధులు ఇంకా ఎందుకు మంజూరు చేయలేదని ఎంపీని ప్రశ్నించారు. అలాగే ఆర్టికల్ 275 కింద గిరిజన ప్రాంతాలకు రావాల్సిన నిధుల కోసం కేంద్ర మంత్రిని గతంలో కోరినా ఇప్పటివరకు మంజూరు కాలేదన్నారు. జగిత్యాల ప్రజలు ఓట్లు వేయలేదనే కారణంతో ఎంపీ చిన్నచూపు చూస్తున్నారనే అభిప్రాయం వ్యక్తం చేశారు.

రాజకీయాల్లో హుందాతనం అవసరం

ముఖ్యమంత్రి చదువు లేదని విమర్శించిన ఎంపీ, ప్రధానమంత్రి ఎంతవరకు చదివారో చెప్పాలని ఎమ్మెల్యే ప్రశ్నించారు. ప్రధానిని 'చాయ్ వాలా' అంటూ పిలిచినా తాము అలాంటి వ్యాఖ్యలు చేయలేదని, రాజకీయాల్లో హుందాతనం ఉండాలని అన్నారు. ఎన్నికల వరకు మాత్రమే రాజకీయాలు ఉండాలని, అనంతరం ప్రాంత అభివృద్ధిపై కలిసి పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాజంగి నందయ్య, మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి శ్రీనివాస్, మాజీ మున్సిపల్ చైర్మన్లు గిరి నాగభూషణం, అడువల జ్యోతి లక్ష్మణ్, వైస్ చైర్మన్ పర్వీన్ మున్నా, మాజీ వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు భీరం రాజేష్, టీపీసీసీ ఎన్‌ఆర్‌ఐ సెల్ చాంద్, నాయకులు గట్టు సతీష్, క్యాదసు నాగయ్య, బాలే శంకర్, తోట మల్లికార్జున్, అహమ్మద్, చందా పృథ్వీ, బద్దం జగన్ మోహన్ రెడ్డి, బోడ్ల రాజు, కొలగాని సత్యం, మ్యానపురి మహేష్, కయ్యూం, కుసరి అనిల్, కౌన్సిలర్లు దుమాల రాజ్ కుమార్, సాయి కిరణ్, ఏనుగుల రాజు, శ్రీనివాస్, శ్రీరామ్ భిక్షపతి, రామకృష్ణ రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

# నీటి ట్యాంక్ ప్రారంభోత్సవానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రికి ఆహ్వానం

- నందికొట్కూరు మండలం కొణిదెల గ్రామంలోని నీటి ట్యాంక్ ప్రారంభోత్సవానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గారిని ఆహ్వానించిన నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త.జయసూర్య.

**నేటి సాక్షి 07 మార్చి నంద్యాల :** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారిని నందికొట్కూరు శాసనసభ్యులు గిత్త జయసూర్య అసెంబ్లీ చాంబర్లో మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గంలోని నందికొట్కూరు మండలం కొణిదెల గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులు గురించి వివరించి కొణిదెల అభివృద్ధికి సొంత నిధులతో మీరు మంజూరు చేసిన రూ.50 లక్షల నిధులతో 90 వేల లీటర్ల సామర్థ్యం ఉన్న ఓవర్హెడ్ నీటి ట్యాంకు నిర్మాణం పూర్తయింది అని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారికి వివరించి ప్రారంభోత్సవానికి ఆహ్వానించిన ఎమ్మెల్యే గిత్త జయసూర్య. నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య గారు నియోజకవర్గ అభివృద్ధి పంచాయతీరాజ్ పనుల గురించి పవన్ కళ్యాణ్ గారికి వివరిస్తూ కొణిదెల గ్రామానికి 'పల్లె పండుగ 1.0'లో రూ.20 లక్షలకు పైగా వెచ్చించి 3 అంతర్గత రోడ్లు పల్లె పండుగ 2.0'లో రూ.45 లక్షలతో చేపట్టిన 7 సీ రోడ్ల పనులు పురోగతిలో ఉన్నాయి ఎమ్మెల్యే గిత్త జయసూర్య గారు తెలపడం



జరిగింది అనంతరం: కొణిదెల జిల్లా పరిషత్తు స్కూలు నుంచి పగిడ్యాల మండల పరిధిలోని లక్ష్మాపురం వరకు 5 కి.మీ. మేర బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.4 కోట్లు, పంచాయతీ రాజ్ నిధులు రోడ్డు నుంచి గ్రామం వరకు రోడ్డు పునరుద్ధరణకు రూ.45 లక్షలు మంజూరు చేయాల్సిందిగా ఎమ్మెల్యే గిత్త జయసూర్య విన్నపించుకోవడం జరిగింది. అంతరం: పంచాయతీ రాజ్ సంబంధించిన నందికొట్కూరు నియోజకవర్గ పరిధిలోని గ్రామాలలో చాలా రోడ్లు అభివృద్ధికి నోచుకోలేక, నిర్లక్ష్యానికి గురయ్యాయి. కనీసం రోడ్ల మరమ్మత్తు పనులు కూడా గత ప్రభుత్వం చేపట్టకపోవడంతో అనేక గ్రామాలలో రోడ్లు చాలా అధ్వాన్న పరిస్థితుల్లో ఉన్నాయి. వర్షాలకు నియోజవర్గంలోని గ్రామీణ ప్రాంతాల రోడ్లన్నీ దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో పంచాయతీరాజ్ శాఖ తరఫున రోడ్ల మరమ్మతులకు, కొత్త రోడ్ల నిర్మాణానికి అధిక నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే గిత్త జయసూర్య కోరడం జరిగింది. అనంతరం: కొత్తపల్లి మండలం శివపురం గ్రామం నల్లమల్ల ఫారెస్ట్ పరిధిలో వెలిసినటువంటి కొలనుభారతి సరస్వతి అమ్మవారి గుడికి వెళ్ళుటకు బీటీ రోడ్డుకు మరియు విద్యుత్ సౌకర్యానికి మరియు జూపాడు బంగ్లా మండలం పారమంచాల గ్రామం నుంచి మిడ్తూర్ మండలం బరక సంజరాయుడు వరకు గతంలోనే అనుమతి ఇచ్చిన బీటి రోడ్డుకు ఫారెస్ట్ అధికారులు ఆటంకం కలిగిస్తున్నారు, మానవత్వ దృక్పథంతో మా నియోజకవర్గంలో ఉన్న గుళ్ళు కు రహదారులకు నిర్మించుటకు సహకరించవలసిందిగా పవన్ కళ్యాణ్ గారికి విన్నపించిన ఎమ్మెల్యే గిత్త జయసూర్య ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారు స్పానుకులంగా స్పందిస్తూ త్వరలోనే నందికొట్కూరు నియోజకవర్గం సమ-స్యలపై, అభివృద్ధి పనులకు పూర్తి సహకారం అందిస్తామని, సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యంగా నిధుల మంజూరు, రోడ్డు పనులు, స్థానిక సమస్యలపై త్వరలోనే చర్యలు చేపడతామని స్వయంగా కొణిదెల గ్రామాన్ని సందర్శిస్తామని భరోసా ఇచ్చారు. నందికొట్కూరు గౌరవ శాసనసభ్యులు శ్రీ గిత్త జయసూర్య , ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారికి నియోజకవర్గం సమస్యల పైన స్పానుకులంగా స్పందించినందుకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు..

# ప్రజా పోరాటాలకు విరాళాలిచ్చి సహకరించండి...

- సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.రమేష్ బాబు...

**నేటి సాక్షి 07 మార్చి జూపాడుబంగ్లా: :** నిత్యం గ్రామీణ ప్రాంతాల్లో ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తూ ప్రజా పోరాటాల నిర్వహించే సిపిఐ పార్టీకి విరాళాలు ఇచ్చి తమ వంతు సహాయ సహకారాలు అందించాలని సీపీఐ పార్టీ నీ ఆదరించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం. రమేష్ బాబు మండల నాయకులు మక్బుల్ భాష, ఎం.రాజులు అన్నారు..శనివారం మండలంలోని తుడిచర్ల గ్రామంలో గడపగడపకు సిపిఐ కార్యక్రమంను నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏ పార్టీ అధికారంలో ఉన్న పాలక ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ నిత్యం గ్రామీణ ప్రాంతాల్లో అనేక స్థానిక సమస్యలపై కమ్యూనిస్టు పార్టీ పోరాటాలు నిర్వహిస్తుందని తమ వంతు బాధ్యతగా



పేద ప్రజల పార్టీగా ఉన్న సిపిఐ పార్టీని ఆదరించేందుకు గడపగడపకు సిపిఐ మీ ముందుకు వస్తుందని మీ వంతు బాధ్యతగా విరాళాలు ఇచ్చి ముందుకు నడిపించాలని వారు ప్రజలను కోరారు. ఎన్నికల్లో అనేక హామీలు ఇచ్చిన పాలక పార్టీలు ప్రజా సమస్యలను గాలికి వదిలేసి తమ స్వలాభం కోసం రాజకీయాలు చేస్తున్నారని గ్రామీణ ప్రాంత సమస్యలను పట్టించుకోవడంలేదని వారు విమర్శించారు. పేద ప్రజలకు అండగా ఏ సమస్య వచ్చినా ఎర్రజెండా చేత పట్టి నిలబడే వంద సంవత్సరాల చరిత్ర కలిగిన భారత కమ్యూనిస్టు పార్టీని విరాళాలు అందించి ముందుకు నడిపించాలని వారు కోరారు..

# చర్లపల్లిలో ప్రారంభమైన ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక

### పారిశుద్ధ్యంపై ప్రతిజ్ఞ..పాఠశాలలో శ్రమదానం



**నేటి సాక్షి, ఎండపల్లి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రత్యేక కార్యక్రమాన్ని శనివారం మండలంలోని చర్లపల్లి గ్రామంలో ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ పడిదం లావణ్య-మొగిలి ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయ ఆవరణలో గ్రామస్తులతో కలిసి పారిశుద్ధ్యంపై ప్రతిజ్ఞ చేసి సమావేశం నిర్వహించారు. అనంతరం స్థానిక ప్రాథమిక పాఠశాలలో శ్రమదానం చేపట్టి పాఠశాల ప్రాంగణాన్ని శుభ్రపరిచారు. గ్రామ అభివృద్ధి, పరిశుభ్రత, ప్రజా పాలన ప్రణాళిక లక్ష్యాలను గ్రామ ప్రజలకు తెలియజేస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ లావణ్య మొగిలి మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక గ్రామాల అభివృద్ధికి దోహదపడుతుందని, పారిశుద్ధ్యాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని, గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రజల సహకారం అవసరమని అన్నారు. గ్రామ ప్రజలు పరిశుభ్రతపై అవగాహన పెంచుకొని చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా స్వచ్ఛమైన వాతావరణాన్ని కాపాడాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తిరుపతి రెడ్డి, ఉప సర్పంచ్ అల్లం తిరుపతి, వార్డు సభ్యులు జెల్ల శ్రీనివాస్, సిగిరి శ్రేవిన్, చుంచు పద్మ, సిగిరి లత, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యం, అంగన్వాడి ఉపాధ్యాయురాలు కదారి పద్మ, ఫీల్డ్ అసిస్టెంట్ జంజుపెల్లి సురేష్, పంచాయతీ కారోబర్ ఉరగొండ శోభన్, చుంచు అనిల్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యం

### మంత్రి వివేక్ వెంకటస్వామి




**నేటి సాక్షి (మంచిర్యాల్ )మార్చ్ 7 :** పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్య అభివృద్ధి -- భద్రతా నిబంధనలు తప్పనిసరి ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రాన్ని రాబోయే సంవత్సరాల్లో 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు రాష్ట్ర కార్మిక, ఉపాధి మరియు గనుల శాఖ మంత్రి జీ. వివేక్ వెంకటస్వామి. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు ప్రభుత్వం పరిశ్రమల ప్రతినిధులు, పెట్టుబడిదారులు మరియు ఇతర భాగస్వాములతో నిరంతరం సంప్రదింపులు కొనసాగిస్తున్నదని మంత్రి తెలిపారు. శనివారం హైదరాబాద్‌లో Confederation of Indian Industry (సీఐఐ) నిర్వహించిన వార్షిక సమావేశంలో మంత్రి మాట్లాడారు. కొత్త పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతను సిద్ధం చేయడానికి ప్రభుత్వం నైపుణ్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. ఆధునిక పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు శిక్షణ అందించేందుకు ఉపాధి శాఖ ఆధ్వర్యంలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు (ూజం) ఏర్పాటు చేసారని తెలిపారు. భవిష్యత్ పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలపై సీఐఐతో కూడా చర్చలు జరిపినట్లు చెప్పారు. తెలంగాణలో పెట్టుబడులు స్థిరంగా పెరుగుతున్నాయని, త్వరలోనే అనేక కొత్త పరిశ్రమలు రాష్ట్రంలో స్థాపించబడనున్నాయని మంత్రి పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో భవిష్యత్ పరిశ్రమల అవసరాలను తీర్చగల నైపుణ్యంతో కూడిన మానవ వనరులను సిద్ధం చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. పరిశ్రమల మారుతున్న అవసరాలకు అనుగుణంగా కొత్త శిక్షణ కోర్సులను కూడా ప్రవేశపెడుతున్నామని తెలిపారు. పెట్టుబడులను ఆకర్షించడంలో Ease of Doing Business మాత్రమే కాకుండా రాజూవవస శీట ణశీఅస్త్ర దీబంఱఅవం కూడా సమానంగా ముఖ్యమని మంత్రి స్పష్టం చేశారు. పరిశ్రమల అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తున్నప్పటికీ, పరిశ్రమలు కూడా నిబంధనలు, ప్రమాణాలను స్వచ్ఛందంగా పాటించాల్సిన బాధ్యత ఉందని అన్నారు. పరిశ్రమలు భద్రతా మార్గదర్శకాలు మరియు చట్టబద్ధ నిబంధనలను కచ్చితంగా పాటించాలని మంత్రి కోరారు. భారత ప్రభుత్వం మరియు తెలంగాణ ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను పరిశ్రమలు అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు.

# రైతు కలలో లక్ష్మీనరసింహస్వామి దర్శనం తన భూమిలో ప్రత్యక్షం

**నేటి సాక్షి (మంచిర్యాల్) మార్చి 7 :** బుగ్గ పరిసరాల్లోని బుగ్గగూడెం గ్రామానికి చెందిన గుండా గణపతి అనే వ్యక్తి పత్తి చేనులో శుక్రవారం నీటి బుడగలు ఒక్కసారిగా పైకి వచ్చాయి. వివరాలు ఇలా ఉన్నాయి. గణపతికి గత రెండు సంవత్సరాల కిందట శ్రీ లక్ష్మీనరసింహస్వామి తాను బుగ్గ ప్రాంతంలో కొలువై ఉన్నానని కలలోకి వచ్చాడు. అప్పటినుండి తరచూ కలలో కనిపిస్తూ తనను ఆరాధించాలని కలలోకి వస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో గుండా గణపతి లక్ష్మీ నరసింహ స్వామి ని అప్పటినుండి ముక్కుకుంటూ తన పత్తి చేనులో దీపారాధన చేస్తున్నారు. తాజాగా ఈ శుక్రవారం తన కుటుంబంతో మొక్కుకుందామని వచ్చి అర్చకులతో పూజలు చేపిస్తుండగా భూమిపై నీళ్లు చల్లడంతో ఒక్కసారిగా నీళ్ల ప్రవాహం పొంగి మహిమను చూపింది. దీంతో చలించి పోయిన గుండా గణపతి కుటుంబ సభ్యులు స్వామి వారికి అనుగ్రహం ఉందని భావించారు. అప్పటికప్పుడే అదే ప్రాంతంలో ఒక చిన్న చలువ పందిరి వేసి శనివారం శ్రీ లక్ష్మీనరసింహస్వామి చిత్రపటాన్ని అర్చకులు సతీష్ శర్మ సమక్షంలో పూజలు చేసి నెలకొల్పుకున్నారు. ఈ పూజా కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులతో పాటు తాండూరు మండలానికి చెందిన శ్రీ మాసాడి శ్రీదేవి శ్రీరాములు, అభినవ సంతోష్ కుమార్ దంపతులు పాల్గొన్నారు. విషయం తెలిసిన వెంటనే లక్ష్మీనరసింహస్వామికి పూజ సామాగ్రి తో పాటు, స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని అభినవ సంతోష్ కుమార్ దంపతులు తమ వంతుగా అందించారు. భక్తులకు అన్నదానాన్ని చేపట్టారు.

# ఆడదే..ఆధారం.!!



## ( మనందరి కథ 'ఆడ'నే ఆరంభం )



'కార్యేషు దాసి' అంటూ.. 'దాస్యరికం' అంటగడుతరు
'కరణేషు మంత్రి' అంటూ..తన ఆలోచనలనే కొట్టిపారేస్తరు
'భోజ్యేషు మాత' అంటారే తప్ప..అంతటి స్థానం ఇవ్వరు
'శయనేషు రంభ' అని తన ఇష్టాయిష్టాలను లెక్కే చేయరు
'రూపేషు లక్ష్మి' అని పొగుడుతూనే..పక్క చూపులు చూస్తరు
'క్షమయా ధరిత్రి' అని..కీర్తిస్తూనే ఓపికకే పరీక్ష పెడుతరు

అలాంటి 'అపురూపమైన-ఆడజన్మ' ఔన్నత్యాన్ని
గుర్తించి జరుపుకునేదే నేటి 'అంతర్జాతీయ మహిళా దినోత్సవం'

'భూ-దేవంత' సహనాన్ని నింపుకొని..ఆ దేవుని ప్రతిరూపంగా ప్రేమిస్తూ..అడుగడుగునా అవహేళన అఘాయిత్యాలు భరిస్తూ.. అందులోనే చిన్ని సంతోషాలనూ వెతుక్కుంటూ తృప్తిపడుతూ... బ్రతికే 'అల్పాసంతోషి' మహిళ.!

అమృత హృదయాన్ని కలిగివున్న దేవతాస్వరూపిణి మహిళ.!అమ్మమనసుతో క్షమించే పార్వతీ మాత మహిళ.! తన ఉనికిని అంతమొందించే ఆగడాలు హద్దుదాటిన వేళ అపర కాళికై అంతమొందించే శక్తిస్వరూపిణీ..మహిళా..!

సమాన హక్కులంటూ వీధిన పడే ఓ మహిళా.. నీ ఔన్నత్యమెంతటిదో నీవేరుగవా..? సమస్త సృష్టికి ఆధారభూతం నీవేకదా..

నీవు లేనిదే పురుషుడు ఏ శుభకార్యానికీ పనికిరాడంటూ వేదమే ఘోషిస్తుంది.!

స్త్రీత్వం నింపుకుని సమస్త జగత్తు శోభిస్తుంది..మహిళ అంటే 'మమతల కోవెల'.! పరమాత్మ సృష్టిలో అమృతమయమైన దీవెన..సమస్త మానవాళికి 'ఆడదే..ఆధారం' మనందరి కథ 'ఆడ'నే ఆరంభం.!!

నేటి సాక్షి - కోరుట్ల
(రాధారపు నర్సయ్య)

### అంతర్జాతీయ మహిళా దినోత్సవం



ప్రతి ఒక్కరి జీవితంలో ఎన్నో ముఖ్య పాత్రలు పోషిస్తున్న మహిళలకి ఓ ప్రత్యేక రోజును కేటాయించారు. అదే 'అంతర్జాతీయ మహిళా దినోత్సవం'.ఓ వ్యక్తి జీవితంలో స్త్రీ చాలా పాత్రలు పోషిస్తుంది. తల్లి మొదలు, చెల్లి, భార్య, గురువు ఇలా ఎన్నో బాధ్యతలను ఆమె అలవోకగా చేయగలదు. ఆమెలోని గొప్పదనం ఏంటంటే ఓ వైపు ఇంటిని చక్కబెడుతూనే మరోవైపు సంఘంలోనూ ఎన్నో పాత్రలను పోషిస్తుంది. మగవారికి సమానంగా టీచర్, ఇంజనీర్, పైలెట్ వంటి బాధ్యతలను కూడా ఆమె స్వీకరించి వందశాతం వాటికి న్యాయం చేస్తుంది. నేటి కాలంలో స్త్రీలు సాధించిన విజయాలు నిజంగా ఆకాశాన్నంటాయి. వీటన్నింటికి ప్రతీకగా ప్రపంచంలోని మహిళల కోసం 'అంతర్జాతీయ మహిళా దినోత్సవం'ని ఏర్పాటు చేశారు. ముందుకాలంతో పోల్చితే రోజురోజుకి మహిళలు ముందుకు సాగుతున్నారు. దేశ ఆర్థికాభివృద్ధిలో వారి పాత్ర కీలకం. ప్రతి సంవత్సరం మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుగుతుంది. ఈ రోజున వారు సాధించిన విజయాలకి గుర్తుగా వారిని గౌరవించే రోజు. ఇక 2026 ఇంటర్నేషనల్ విమెన్స్ డే థీమ్ 'ఇన్‌స్పైర్ ఇన్‌క్లూజన్'. దీని అర్థం మహిళలకు అన్ని రంగాల్లో అవకాశం ఇచ్చి అభివృద్ధికి బాట వేయడం.ఇక మహిళా దినోత్సవ చరిత్ర గురించి మాట్లాడితే.. నేడు అన్ని రంగాల్లోనూ ముందున్న మహిళలు.. తమ అద్భుత తెలివి, ఆలోచించే విధానంతో రోజురోజుకి పురోగతి సాధిస్తున్నారు.

### మహిళా దినోత్సవ లక్ష్యం..

లింగ సమానత్వాన్ని జరుపుకుంటారు. ఈ రోజున వివిధ రంగాల్లో విజయాలు సాధించిన మహిళల్ని గుర్తించి వారికి గౌరవిస్తారు. సాంఘిక, రాజకీయ, సాంస్కృతిక కార్యక్రమాల్లో స్త్రీ, పురుషులు సమానమని చెప్పడమే ముఖ్య ఉద్దేశ్యం.

### ఈ రోజుకు 'కలర్స్-లింక్'..

ఇక ఈ రోజున ప్రత్యేకమైన కొన్ని రంగుల దుస్తులు కూడా ధరిస్తారు. ఎక్కువగా ఊదారంగు(పర్పుల్), ఆకుపచ్చ, తెలుపు రంగుల వస్త్రాలని ధరిస్తారు. ఇక్కడ పర్పుల్ అంటే ఊదా రంగు న్యాయ, గౌరవానికి సూచనగా, ఆకుపచ్చ రంగు హామిని ఇస్తుంది. ఇక తెలుపు స్వచ్ఛతకి సూచనగా ధరిస్తారు.అదే విధంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఏ దేశానికి, సంస్థ, సంఘానికి మాత్రమే పరిమితం కాలేదు. ప్రపంచ వ్యాప్తంగా దీనిని జరుపుకుంటారు. ఈ రోజుని సెలబ్రేట్ చేసుకోవడానికి లింగ బేధం కూడా ఉండదు.దీనిని ప్రతి ఒక్కరూ కూడా సెలబ్రేట్ చేసుకోవచ్చు. మీ జీవితంలో ఎన్నో పాత్రలు పోషించిన స్త్రీలు ఉంటారు. అమ్మ, గురువు, అక్క, చెల్లి,భార్య, ఇలాంటి ఎన్నో ముఖ్య పాత్రలు పోషిస్తున్న వారందరికీ ఈ రోజున కృతజ్ఞతలు అదే విధంగా అభినందనలు తెలపండి. దీని వల్ల వారు అందించిన సేవలని మీరు గుర్తించినట్లుగా అవుతుంది. అందరికీ 'హ్యాపీ ఉమెన్స్ డే'.!!

### ఇక చరిత్ర విషయానికొస్తే..

1909 ఫిబ్రవరి 28న యూఎస్ఏ న్యూయార్క్ నగరంలో అమెరికన్ సోషలిస్ట్ పార్టీ జాతీయ మహిళా దినోత్సవం జరుపుకుంది. కార్మిక కార్యకర్త థెరిసా మల్కెయిల్ నగరంలోని రెడీమెడ్ గార్మెంట్స్ కార్మికులపై జరుగుతున్న అణచివేతని ఖండిస్తూ ఈ దినోత్సవాన్ని ప్రారంభించారు. దీని ప్రాముఖ్యతని చూసి ముగ్ధులైన అమెరికన్ సోషలిస్ట్ నాయకులు మహిళా దినోత్సవాన్ని ఎందుకు జరుపుకోవాల్సిన అవసరం ఉందో చెప్పారు. కానీ, ఆ టైమ్‌లో ప్రత్యేకమైన రోజుని అనుకోలేదు. ఇదే నేపథ్యంలో 1975, 1977లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఐరాస నిర్వహించింది. సంస్థ సంబరాలు ప్రారంభించి మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా ప్రకటించింది. ఈ రోజున మహిళల హక్కులని కాపాడి, వారు శాంతియుతంగా జీవించేందుకు చర్యలు తీసుకోవాలని కట్టుబడి ఉంది.









